వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
ఆదివారం 22 జూన్ 2025

## ఏకశిలా నగర రామునికి శనివారం పూజలు



**ఒంటిమిట్ట జూన్ 21( ప్రభాతవార్త)**

రెండవ అయోధ్య ఆంధ్ర భద్రాచలం ఏకశిలానగరంగా పేరొందిన ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో టీటీడీ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు శనివారం సందర్భంగా శ్రీ కోదండ రామస్వామికి స్నపన కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా అర్చకులు వేకువజామున స్వామివారికి నిర్వహించు అభిషేక కార్యక్రమాలకు కావలసిన పూజా సామాగ్రి తీసుకొని భజంత్రీలతో ఆలయ ప్రదక్షిణ గావిస్తూ అంతరాలయంలోకి ప్రవేశించారు. అనంతరము పాంచ రాత్ర ఆగమ ప్రకారం వైష్ణవ సాంప్రదాయ పద్ధతిలో శ్రీ సీతారామ లక్ష్మణ మూలవరులకు శ్రీ సూక్త ,పురుష సూక్త, లక్ష్మీ సూక్త ప్రకారంగా వైదిక సంప్రదాయ పద్ధతిలో పంచామృత అభిషేకాలు నిర్వహించి నూతన వస్త్రాలతో, పలు రకాలైన కనక భూషణ, పుష్ప తరువులతో అద్భుతంగా అలంకరించి స్వామివారి నిత్య పూజ కంకర్యాలలో పాల్గొన్న భక్తులకు ఆలయ ప్రవేశం కల్పించారు. శనివారం కావడం చేత పలు ప్రాంతాలకు చెందిన భక్తులు విశేషంగా ఆలయానికి తరలివచ్చి వారి వారి గోత్రనామాలతో జగదభిరామునికి పూజా కార్యక్రమాలు నిర్వహించుకుని అర్చకులు స్వామి వారికి నిర్వహించే అభిషేక కార్యక్రమాలను కనులారా తిలకించి ఆనంద భరితులయ్యారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయమంతా రామనామ సంకీర్తనలతో మార్మోగింది.

## ముగిసిన జ్యేష్ఠ మాస పూజా కార్యక్రమాలు



**గోపవరం, జూన్ 21, ప్రభాతవార్త**

కడప జిల్లా బద్వేల్ నియోజకవర్గం గోపవరం మండలం వల్లేర వారి పల్లె లో వెలసిన స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నందు జ్యేష్ఠ మాసం చివరి శనివారం సందర్భంగా స్వామివారికి వేకువ జాము నుంచి ప్రత్యేక అభిషేక,పూజ కార్యక్రమాలు నిర్వహించారు. తదుపరి వచ్చిన భక్తులు పాదయాత్ర దిగ్విజయంగా పూర్తి అయిన సందర్భంగా స్వామివారి ఆశీర్వాదం స్వీకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వామి వారిని నమ్ముకున్న వారికి బాధలు, కష్టాలు తొలగిపోతున్నాయని, స్వామి దర్శించుకోవడం వలన సకాలంలో సమస్యలు తీరుతున్నాయని ,ప్రతి వారం కూడా స్వామి వారికి జరిగే అభిషేకాలు పూజలు మనసుకు చాలా సంతోషాన్ని అందిస్తున్నాయని తెలియజేశారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి కుటుంబ సభ్యులు అన్నదాన కైంకర్యం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# స్వచ్ఛ జిల్లాగా వైఎస్ఆర్ కడప







**కడప, జూన్ 21 ప్రభాతవార్త :**

స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా వైఎస్ఆర్ కడప జిల్లాను కాలుష్య రహిత స్వచ్ఛ జిల్లాగా తీర్చిదిద్దుతామని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శనివారం కడప వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో నిర్వహించిన యోగాంధ్ర వేదికపై స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ "స్వచ్ఛ దివస్" కార్యక్రమాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ విప్, కడప నియోజకవర్గ ఎమ్మెల్యే ఆర్. మాధవి రెడ్డి, జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్, జేసీ అదితిసింగ్ లతో కలిసి జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి.. స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కడప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభించిన స్వచ్ఛ దివస్ ఈ కార్యక్రమంలో భాగంగా.. తెదేపా పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే ఆర్. మాధవి రెడ్డి లతో క్రికెట్ స్టేడియంలో మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి 3వ శనివారం చేపడుతున్న స్వచ్ఛ దివస్ కార్యక్రమంతో స్వచ్ఛత వైపు ఒక ముందడుగు వేద్దామన్నారు. వేస్ట్ మేనేజ్మెంట్ అంశానికి సంబంధించి ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతి పౌరుడు మూడవ శనివారాన్ని స్వచ్ఛ ఆంధ్రగా పాటించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం అన్నారు. ప్రతినెల మూడవ శనివారాన్ని స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర పాటించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దామని పిలుపు నిచ్చారు. జిల్లా అంతటా పరిశుభ్రత కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలని, తడి పొడి చెత్తలపై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. ఈ వేస్ట్ ఎక్కువగా పట్టణ ప్రాంతాల్లో ఉంటుందని దాని పునర్వినియోగంపై ప్రజల్లో అవగాహన చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. మన జిల్లాను ఆరోగ్య జిల్లాగా, కాలుష్య రహిత జిల్లాగా తీర్చడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. ఎమ్మెల్యే మాధవి రెడ్డి మాట్లాడుతూ మంచి ఆలోచనలు, ఆరోగ్యవంతమైన శరీరం, స్వచ్ఛమైన వాతావరణం, ఇంటి దగ్గర, పనిచేసే చోట పరిశుభ్రతలతో మన రాష్ట్రాన్ని స్వర్ణ ఆంధ్రగా, స్వచ్ఛ ఆంధ్రగా, మన జిల్లాను స్వచ్ఛమైన కాలుష్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, కేఎంసి అదనపు కమిషనర్ రాకేష్ చంద్ర, జెడ్పి సీఈవో ఓబులమ్మ, డిపివో రాజ్యలక్ష్మి, అన్ని శాఖల జిల్లా అధికారులు, వైద్య ఆరోగ్య, ప్రజారోగ్య శాఖల అధికారులు, ఇంజనీర్లు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# సర్వరోగ నివారిణి యోగ

**మారుమూల గ్రామాలలోనూ యోగాంధ్ర**

**రాజంపేట మండలంలోనే వేలాది మంది యోగ**



**రాజంపేట జూన్21 ప్రభాతవార్త :**

యోగ శనివారం అందరి నోటా వినిపించిన మాట .ఇదో ఉద్యమంలా మారింది .మారుమూల గ్రామాలను యోగాంధ్ర తాకింది. ప్రతి సచివాలయంలోను పల్లె లేదు, పట్టణం లేదు, ప్రధాన కేంద్రం లేదు, మారుమూల గ్రామం లేదు, అన్ని చోట్ల యోగేంద్ర పక్కాగా అమలు చేశారు. రాజంపేట మండలంలోనే వేలాదిమంది యోగాలో పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ క్రీడా మైదానంలో అంతర్జాతీయ యోగా వేడుకలలో జిల్లా అదనపు మూడో న్యాయమూర్తి ప్రవీణ్ కుమార్ జిల్లా లీగల్ సర్వీసెస్ అసోసియేషన్, రాజంపేట, బార్ అసోసియేషన్, రాజంపేట ఆడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ అమెరికా వారి సహకారంతో "అంతర్జాతీయ యోగ డే"జిల్లా పరిషత్ హై స్కూల్ గ్రౌండ్, రాజంపేట లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా 3వ అడిషనల్ జిల్లా జడ్జి ప్రవీణ్ కుమార్ , జూనియర్ సివిల్ జడ్జి రాజన్ ఉదయ్ ప్రకాష్ ,పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజా, వాసన్ ఐ కేర్ హాస్పిటల్, ప్రముఖ కంటి వైద్యులు డాక్టర్ ఆనంద్ నాయక్ పాల్గొన్నారు. కూచివారిపల్లె సచివాలయంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రాజు యోగాంధ్రలో మున్సిపల్ కార్యంలో కమీషనర్ డి .శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఉద్యోగులు , పారిశుధ్య కార్మికులు యోగ ఆంధ్రలో పాల్గొన్నారు.యోగ గురువు బాలాజీ మాట్లాడుతూ ప్రతి రోజు యోగాసానాలు చేస్తూ ప్రాణాయామము కూడా అలవాటు చేసుంటే ఆరోగ్యాంగా ఉంటూ బీపీ, షుగర్,ఇతరత వ్యాధులు నివారించ వచ్చన్నారు.వాకర్స్ ఇంటర్నేషనల్ పాస్ట్ వైస్ ప్రెసిడెంట్ , శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ కొండూరు శరత్ కుమార్ రాజు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించడమైనది. ఈ కార్యక్రమంలో రాజంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు పి.హనుమంత్ నాయుడు, సెక్రటరీ జాఫర్ బాషా పాల్గొన్నారు. కూచివారి పల్లి యోగేంద్ర కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు ఉద్యానమోహన్ రాజు మాట్లాడుతూ సర్వరోగ నివారిణి యోగా అని పేర్కొన్నారు. యోగాను ప్రతిరోజు ఆచరిస్తే అంతకుమించిన ఆరోగ్యం లేదని పేర్కొన్నారు. ఎగువబసినాయుడు గారిక్పల్లెలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతుగుంట రమేష్ నాయుడు, సాతుపల్లెలో లక్ష్మీనారాయణ, పలు సచివాలయాలలో వివిధ పార్టీల నాయకులు ,అధికారులు పాల్గొన్నారు.

**యోగాను జిల్లా ప్రజలందరూ ప్రతిరోజు అభ్యసించి**

## శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండాలి.



**రాయచోటి జూన్ 21ప్రభాత వార్త**

యోగాను జిల్లా ప్రజలందరూ ప్రతిరోజు అభ్యసించి శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండాలని, అన్నమయ్య జిల్లాను యోగాంధ్ర కార్యక్రమంలోని వివిధ అంశాలలో మొదటి స్థానంలో నిలిపిన జిల్లా ప్రజలకు అభినందనలు తెలిపారు. జూన్ 21న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం ఉదయం రాయచోటిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్ నందు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి నాయకత్వంలో 5000 మంది తో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా రాయచోటిలో 5000 మంది తో యోగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని, జిల్లా వ్యాప్తంగా 8 లక్షల మందితో 5050 ప్రాంతాల్లో యోగ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నంలో ప్రధాన మంత్రి మరియు ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ప్రత్యక్షంగా 05 లక్షల మందితో రాష్ట్రవ్యాప్తంగా 02 కోట్ల మందితో యోగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో మే 21 నుండి జూన్ 21 వరకు యోగాంధ్ర కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడంలో కృషిచేసిన జిల్లా అధికారులకు, ఎంపీడీవోలకు ముఖ్యంగా రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, పిడిడిఆర్డిఏ సత్యనారాయణ, రాయచోటి మున్సిపల్ కమిషనర్ వాసు, మరియు జిల్లా పర్యాటకశాఖ అధికారి నాగభూషణం లను ప్రత్యేకంగా అభినందించారు. అత్యంత ఉత్సాహంతో నెలరోజులుగా యోగ యొక్క ప్రాముఖ్యతను తెలియజేసి, యోగాని ప్రజల జీవితంలో భాగస్వామ్యం చేసి శరీరక మానసిక ఆధ్యాత్మిక పరిణితి సాధించేందుకు కృషి చేసిన జిల్లా యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# సర్వం....యోగ.....మయం

**పార్టీలకతీతంగా పాల్గొన్న రాజకీయ నాయకులు**

**ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు,ప్రభుత్వ ఉద్యోగులు**




**పులివెందుల,జూన్ 21,ప్రభాత వార్త:**

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పులివెందుల అంతా సర్వం యోగమయం అయింది. పార్టీలకతీతంగా రాజకీయ పార్టీ నాయకులు యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వ ,ప్రైవేట్ పాఠశాలల, కళాశాలల విద్యార్థిని విద్యార్థులు,వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు ఉత్సాహంగా ఉల్లాసంగా యోగ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపుమేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ప్రతి ప్రభుత్వ కార్యాలయం వద్ద సిబ్బంది , విద్యాసంస్థల యందు అధ్యాపక ఉపాధ్యాయ విద్యార్థిని విద్యార్థులు యోగా చేపట్టారు. ప్రభుత్వం తరఫున పులివెందుల మున్సిపల్ కమిషనర్ రాముడు ఆధ్వర్యంలో పట్టణంలోని వైయస్సార్ ఇంటిగ్రేటెడ్ క్రీడా మైదానం నందు ఉన్న హాకీ స్టేడియంలో యోగా గురువు వెంకటరామి రెడ్డి సమక్షంలో ఏర్పాటు చేసిన యోగా శిబిరంలో వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు రాజకీయ నాయకులు మున్సిపల్ శాఖ లోని వివిధ విభాగ సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగా గురువు వెంకటరామీ రెడ్డి హాజరైన వారందరితో యోగ ఆసనాలు వేయించారు. యోగాలో ఉన్న అన్ని రకాల విభాగాల విశిష్టతను గురించి యోగా గురువు వివరించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం నాయకులు వంగల శశిభూషణ్ రెడ్డి, మద్దూరి వెంకట్రామిరెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి బీటెక్ రవి సతీమణి మా రెడ్డి లతాలు మాట్లాడుతూ మన ప్రాచీన భారతదేశ వారసత్వ సంపద యోగాని, యోగా చేయడం వలన సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ఎటువంటి రోగాలు దరి చేరవని కావున ప్రతి ఒక్కరు ప్రతిరోజు యోగా చేసి సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందాలని వారన్నారు. మన భారతీయ సంస్కృతిని ప్రపంచ దేశాలకు తెలిసేలా చేసి మన దేశ ప్రతిష్ఠిన నిలబెట్టిన గొప్ప నాయకుడు నరేంద్ర మోడీ అని. నరేంద్ర మోడీ వల్లనే నేడు జూన్ 21 వ తేదీని అంతర్జాతీయ యోగా దినోత్సవం గా ప్రపంచం గుర్తించిందన్నారు. యోగా చేయండి ఆరోగ్యాన్ని కాపాడుకోండి రోగాలను దరిచేరనియకండి అని ఈ రోజు మాత్రమే నామ మాత్రం కాకుండా ప్రతిరోజు యోగా చేయడం అలవాటుగా చేసుకోవాలన్నారు. అంతకుమును పో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. దాదాపు రెండు గంటలసేపు యోగ గురు పర్యవేక్షణలో ఒక్కొక్క ఆసనం చేస్తూ ఆసనం ప్రతిష్టతను గురించి గురువు ద్వారా తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులు ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వ ప్రవేట్ పాఠశాలల ,కళాశాలల విద్యార్థిని విద్యార్థులు , అధ్యాపకు ఉపాధ్యాయ బృందం, సచివాలయాల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా యోగా దినోత్సవం.

**చిట్వేలి, జూన్ 21, ప్రభాతవార్త:**



అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా శనివారం చిట్వేలి మండల వ్యాప్తంగా యోగాంధ్రాను ఘనంగా నిర్వహించారు. ఉన్నత పాఠశాలలో హెచ్ఎం దుర్గరాజు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఫారెస్ట్ రేంజ్ అధికారి ధీరజ్ పాల్గొన్నారు. మండల కేంద్రంలోని మెయిన్ స్కూల్ ప్రాథమిక పాఠశాలలో సీనియర్ ఉపాధ్యాయులు కామాటం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో యోగాంధ్ర నిర్వహించారు. శ్రీ సాయి వికాస్ హై స్కూల్ నందు కరస్పాండెంట్ తిరుమల రెడ్డయ్య ఆధ్వర్యంలో యోగ డే నిర్వహించారు.ప్రధాన కార్యాలయాల్లోనూ, సచివాలయాల్లోనూ, బ్యాంకులు, ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలల్లో యోగాంధ్ర వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించారు.వారు మాట్లాడుతూ భారత ఖ్యాతిని ప్రపంచానికి తెలిపిన యోగ ప్రాముఖ్యతను వివరించారు. యోగాను దినచర్యలో భాగంగా చేసుకుంటే దైనందిక జీవితంలో ఎదురయ్యే మానసిక ఒత్తిళ్లను అధిగమించి పలు శారీరక రుగ్మతలకు దూరంగా ఉండవచ్చన్నారు. శ్వాసతో ఇంద్రియాలను ఏకం చేస్తూ మనస్సును నిశ్చల స్థితిలో ఉంచి శరీరాన్ని సమతుల్యపరిచే ఏకైక సాధనం యోగానే అన్నారు. ఇట్టి ప్రాముఖ్యత గల యోగాను ప్రజలందరికీ పరిచయం చేయాలన్నదే ప్రభుత్వాల లక్ష్యం అని తెలిపారు. విద్యార్థులకు ఏకాగ్రతను పెంచి జ్ఞాపకశక్తి పెంపొందించడానికి ఉత్తమ మార్గం యోగా అని తెలిపారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు, ఉపాధ్యాయులు,విద్యార్థులు, యోగ మాస్టర్ అంజన్న తదితరులు పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా శ్రీవారి కల్యాణం

**బద్వేలు అర్బన్ ,జూన్ 21, ప్రభాతవార్త**



బద్వేల్ పట్టణంలోని సిద్దవటం రోడ్డులో వెలసిన శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహితం శ్రీ వెంకటేశ్వర స్వామి, అభయాంజనేయ స్వామి దేవాలయం పంచమ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం శ్రీనివాస కళ్యాణం నేతపర్వంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మొదట చతుర్థానార్చన తదితర కార్యక్రమాల అనంతరం స్వామి వారి కళ్యాణం నిర్వహించారు. ఈ కళ్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కంకణాలు తరించి కళ్యాణాన్ని తిలకించారు. అనంతరం కళ్యాణ విశిష్టతను వేద పండితులు భక్తులకు తెలిపారు. అడ్వకేట్ త్రివిక్రమ్ సింగ్ , ఆయన సతీమణి భారతి బాయి చేతుల మీదుగా స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి అనంతరం వారు వేద పండితుల ఆశీర్వచనం పొందారు. కళ్యాణ అనంతరం అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం గరుడ వాహనం పై పురవీధులలో భక్తులు స్వామివారు దర్శనం ఇచ్చారు. స్వామివారి ఊరేగింపు వెంట కోలాటం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి ఊరేగింపులో పలువురు భక్తులు మంచినీరు వారు పోసి కొబ్బరికాయ సమర్పించుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు, ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు వ్నల్ల కొండు వెంకటరమణ,జి, అంకయ్య, పెంచల రెడ్డి, సిద్దయ్య, బాలిరెడ్డి అంకయ్య, వెంకటసుబ్బయ్య, వెంకటరమణ, బండారు సురేష్ బాబు, కుప్పం సుధాకర్, అనీత్ సిరిగిరి నారాయణ, భార్గవ్ తో పాటు పలువురు కమిటీ సభ్యులు ప్రత్యేక ప్రసాదాలను అందజేశారు.



## యోగతో మానసిక ఉల్లాసం కలుగుతుంది

**ఓబులవారిపల్లి జూన్ 21 ప్రభాతవార్త**

ప్రపంచ యోగా దినోత్సవం లో భాగంగా శనివారం మంగంపేటలో ఉన్నఏపీఎండిసి స్కూల్లో సిపిఓ గోపీనాథ్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన అధికారుల ఉద్దేశించి మాట్లాడుతూ యోగా మానసిక ఉల్లాసాన్ని ఉద్దేశాన్ని కలిగించడంతోపాటు యోగా వ్యక్తిగత జీవితంలో సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇస్తుందని ఆయన సూచించారు జియోజికల్ సర్వే ఆఫ్ ఇండియా స్టేట్ యూనియన్ ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో ఉదయం 6 నుంచి 10 గంటల వరకు నిర్వహించారు ఈ కార్యక్రమంలో డాక్టర్ సంకజ్ కుమార్ డాక్టర్ అర్పిత పంకజ్ డాక్టర్ రమేష్ వైష్ణవి సురేష్ నేతల జిఒజికల్ సర్వే ఆఫ్ ఇండియా నుంచి జియో అసిస్టెంట్లు ఏపీఎండిసి అధికారులు స్కూల్ సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.




## గ్రామ గ్రామాన అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమాలు

**రాజుపాళెం, జూన్ 21, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని గ్రామ గ్రామాన చిన్నా, పెద్దా తేడా లేకుండా 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంను ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. ముఖ్యంగా పాఠశాల విద్యార్థులు నిర్వహించిన యోగా కార్యక్రమాల విన్యాసాలు అందరిని అలరించాయి. మేము సైతం అంటూ ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు, ఉపాధి హామీ కూలీలతో ఆ శాఖ అధికారులు, సిబ్బంది గ్రామాలలో యోగా దినోత్సవం కార్యక్రమాలలో పాల్గొన్నారు. మండల పరిషత్, రెవెన్యూ, విద్య, వ్యవసాయం, వెలుగు, ఉపాధి హామీ అధికారులు వారికి కేటాయించిన గ్రామాలలో యోగా దినోత్సవం నిర్వహణతో యోగా కార్యక్రమాలలో పాల్గొనగా కార్యాలయాలలో సిబ్బందితో ఇతర అధికారులు యోగా కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా వెల్లాల గురుకుల కళాశాలల వందల సంఖ్యలో విద్యార్థినీలతో యోగా కార్యక్రమాలు నిర్వహించడం విశేషం అని చెప్పవచ్చు.

## డికేటి ఆన్‌లైన్ నమోదులో విఆర్వో కృష్ణప్పా సస్పెండ్

**లక్కిరెడ్డిపల్లె; జూన్ 21 ప్రభాతవార్త**

మండలంలోని లక్కిరెడ్డిపల్లె టౌన్ కి సంబంధించిన వీఆర్వో కృష్ణప్పా ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ శ్రీధర్ చామకూరి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. టౌన్ పరిధిలోని సర్వే నంబర్ 705/2 లోని రెండు ఎకరాల డీకేటి భూమిని ఆన్ లైన్ లో నమోదు చేసిన విషయం పై కలెక్టర్ కి పిర్యాదు చేయగా ఆ మేరకు విఆర్వో ను విధుల నుండి తొలగించినట్లు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారనీ తెలిపారు.సాయిలీల పిర్యాదు మేరకు తమ భూమిని మరొకరి కి రిజిస్ట్రేషన్ పేరుతో ఆన్ లైన్ లో నమోదు చేయడం జరిగిందని ఆ మేరకు విఆర్వో కృష్ణప్పా ను సస్పెండ్ చేయడం జరిగిందన్నారు.

## సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ఉల్లాసం..

**సుండుపల్లి, జూన్ 21,ప్రభాతవార్త:**

యోగా దినోత్స్నవ సందర్భంగా తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు కళ్ళి రెడ్డప్ప ఆధ్వర్యంలో ఈడిగ పల్లె సచివాలయం 2 దగ్గర దాదాపు 100 మంది పైగా ప్రజలతో యోగడే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాసనాలు వేయడం ద్వారా మానసిక ఉల్లాసం మెరుగైన జీవన విధానం అలాగే ఆరోగ్యవంతమైన సుఖవంతమైన జీవితం యోగా ద్వారానే జరుగుతాయని కనుక ప్రజలందరూ యోగాను దినచర్యలో భాగంగా అలవర్చుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ప్రసాద్ రాజు మండల ఎంఈఓ2 రవీంద్ర నాయక్ మరియు సచివాలయం సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

మైదుకూరు, జూన్ 21, ప్రభాతవార్త :

ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదుకూరు నందు 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కళాశాలలోని బోధన బోధనేతర సిబ్బందితోపాటు విద్యార్థులు అంతర్జాతీయ యోగా ప్రోటోకాల్ ప్రకారము ఉదయం 6: 30 నిమిషాలకు ప్రారంభమైన సమావేశంలో ప్రిన్సిపల్ పి నారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలోనే 191 దేశాలకు పైగా అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించుకోవడం దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ పట్టణానికి వచ్చి యోగ అభ్యాసం చేయటం తెలుగువారిగా మనందరికీ గర్వకారణమని, ప్రతి ఒక్కరి దినచర్యలో భాగంగా యోగ అభ్యసన చాలా ముఖ్యమని తద్వారా ఆరోగ్యం మెరుగవటం, యోగాంధ్ర ద్వారా ఆరోగ్య ఆంధ్ర దిశగా అడుగులు వేయటం శుభపరిణామమని ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడుని అభినందించారు. ముఖ్యంగా విద్యార్థులు, విద్యార్థి దశనుండే ప్రతిరోజు యోగ అభ్యాసం చేయడం ద్వారా చక్కటి శారీరక మానసిక ఆరోగ్యం పొందవచ్చని ఒత్తిడి లేని ఆనందకర జీవితాన్ని గడుపుటకు ప్రతి ఒక్కరికి యోగ ఉపయోగపడుతుంది కనుక ప్రతిరోజు తప్పనిసరిగా కనీసం 45 నిమిషాల పాటు యోగ అభ్యాసం చేయాలని విద్యార్థులకి అధ్యాపకులకు సూచించారు. కళాశాల ఆంగ్ల అధ్యాపకులు యోగ సుశిక్షితులు రాధారాం తమ ప్రసంగంలో యోగ అభ్యసన చాలా సులభతరమైనదని ప్రతి ఒక్కరూ ఆనందంగా చేయదగ్గ అంశం కనుక ముఖ్యంగా శారీరక మానసిక ఆరోగ్యంతో పాటు మైండ్ మేనేజ్మెంట్లో మైండ్ కంట్రోల్ లో యోగా కీలక పాత్ర పోషిస్తుంది కనుక ప్రతి ఒక్కరూ దినచర్యలో భాగంగా యోగ అభ్యసన కచ్చితంగా ఉండాలని సూచించారు. ప్రాచీన భారత సంస్కృతిలో భాగమైన యోగ అభ్యసనం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చొరవతో గత పది సంవత్సరాలుగా అంతర్జాతీయ యోగా దినోత్సవం పరిచయం చేసి వారి దినచర్యలో భాగం చేయటం గొప్ప శుభ పరిణామన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛంద కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని విద్యార్థులు అధ్యాపకులు స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ, తరగతి గదులను శుభ్రం చేయటం, బొటానికల్ గార్డెన్ నందు గల కలుపు మొక్కలను తొలగించి పాదులను చేసి నీటిని పట్టడం జరిగినది. ఈ సందర్భంగా బొటానికల్ గార్డెన్ సుందరీకరణలో భాగంగా పాల్గొన్న ప్రిన్సిపాల్ నారాయణ రెడ్డికి అధ్యాపకులకు విద్యార్థిని విద్యార్థులకు వృక్షశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ పివి కృష్ణారెడ్డి మరియు వృక్షశాస్త్ర విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు.



## యోగాను మించిన ఔషధం లేదు.

ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 21 ప్రభాతవార్త:



స్థానిక శ్రీరాముల పేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో శనివారం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సంస్కృతి సేవాసమితి కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి, డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డి 7మంది యోగా గురువులను సన్మానించారు. ఈ సందర్భంగా ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఐక్యరాజ్య సమితిని సమ్మతింపజేసి యోగా దినోత్సవాన్ని ప్రపంచమంతా జరుపుకునేలా నిర్ణయం చేయడం సంతోషించదగిన విషయమన్నారు. డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ యోగా చేయడం వలన ఏకాగ్రత, చురుకుదనం కలుగుతాయన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో యోగ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న మునిశేఖర్ గురుజీ, బాబు గురుజీ, వెంకటరమణ గురుజీ, ప్రసాద్ గురుజీ, స్వప్న మాతాశ్రీలకు కండువా కప్పి సన్మానించారు. ఇంకా ఈ కార్యక్రమంలో రాయలసీమ వ్యాయామ కళాశాల అధ్యాపకులు డాక్టర్ పంజగల మధుసూదన బాబు, డాక్టర్ కూరపాటి శ్రీనివాసుల రెడ్డి, భజరంగదళ్ భాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయులు షేక్షావలి పాల్గొన్నారు.

## యువత పోరు గోడపత్రాన్ని ఆవిష్కరించిన రాచమల్లు



ప్రొద్దుటూరు జూన్ 21 ప్రభాతవార్త

23న మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తలపెట్టిన యువత పోరు కార్యక్రమంకు సంబంధించిన గోడపత్రాన్ని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి శనివారం ఆవిష్కరించారు. నిరుద్యోగ యువత కోసం, నిరుద్యోగ భృతి కోసం రాష్ట్రవ్యాప్తంగా వైసిపి యువజన విభాగం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ల ముందు పోరాటం చేసేందుకు వైసిపి రాష్ట్ర అధ్యక్షులు మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి పిలుపునిచ్చిన నేపథ్యంలో యువత పోరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు యువజన విభాగం అధ్యక్షులు గురునాథరెడ్డి తెలిపారు. కావున ప్రొద్దుటూరు నియోజకవర్గం లోని యువత తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షులు మోదల్ సందీప్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు బాలాజీ నివాస్ ప్రొద్దుటూరు మండల యువజన విభాగం అధ్యక్షులు రామాంజనేయరెడ్డి రాజుపాలెం యువజన విభాగం అధ్యక్షులు యోగానంద రెడ్డి జిల్లా ప్రచార కమిటీ ఉపాధ్యక్షులు గూడూరు వెంకటేష్ ప్రొద్దుటూరు ఐటీ విభాగం అధ్యక్షులు భాష ప్రొద్దుటూరు మండల వైసీపీ కన్వీనర్ మార్తల ఓబుల్ రెడ్డి సోషల్ మీడియా జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు సురేష్ ప్రొద్దుటూరు యువజన ఉపాధ్యక్షుడు సంటి స్టూడెంట్ యూనియన్ విభాగం అధ్యక్షుడు దావూద్ మరియు వైసీపీ నాయకులు అభిమానులు యువజన విభాగం సభ్యులు పాల్గొన్నారు.

## యోగ ప్రతి మనిషి జీవితంలో దిన చర్య చేసుకోవాలి

తంబళ్లపల్లె జూన్ 21 ప్రభాతవార్త ః



ప్రతి మనిషికి ఆరోగ్యమే మహాభాగ్యమని ప్రతి మనిషి యోగతో సంపూర్ణ ఆరోగ్యం పొందడానికి యోగ దినచర్యలో భాగంగా చేసుకోవాలని స్పెషల్ ఆఫీసర్ అమర్నాథ్ రెడ్డి సూచించారు. శనివారం మండలంలో అంచనాలకు మించి అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, ప్రజలు యోగా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో యోగ ముగింపు కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో యోగా కార్యక్రమం విజయవంతనికి సహకరించిన అధికారులు, సచివాలయు ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాలు, ఉపాధి హామీ సిబ్బంది, అన్ని శాఖల అధికారులను అభినందించారు. భవిష్యత్తులో సైతం ఈ యోగా కార్యక్రమాన్ని మారుమూల గ్రామాలలో సైతం ప్రతి ఒక్కరూ యోగ నిర్వహించి ఆరోగ్యవంతంగా జీవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, ఎంపీడీవో ఉపేందర్ రెడ్డి, తాసిల్దార్ శ్రీనివాసులు, డాక్టర్ ముని కుమార్, ఎంఈఓలు త్యాగరాజు, నాగ సుబ్బరాయుడు, ఏ ఈలు సురేంద్ర, వినోద్ కుమార్, హరినాథ్, సుజాత, ఏపీఎం గంగాధర్, ఏపీవో అంజనప్ప, కార్యదర్శులు, వీఆర్వోలు, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

## మోడీ స్ఫూర్తి 175దేశాల్లో యోగా

కురబలకోట, జూన్ 21 ప్రభాతవార్త :

ప్రధానిమోడీ స్పూర్తితో 175దేశాల్లో యోగాను నిర్వహించేందుకు ముందుకు వచ్చాయని బిజెపి మండల నాయకులు తిరుమల డెయిరీ కరుణాకర్‌రెడ్డి అన్నారు. ఆయన మండలంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. యోగా వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుంది. దైనందిన కార్యక్రమాల్లో రోజూ నిర్వహించడం వల్ల అధ్యాత్మికవైపు మనస్సు మరులుతుందని తెలిపారు. జ్ఞాపక శక్తి, ఏకాగ్రతకు దోహదపరుస్తుందని తెలిపారు. ఇది జీవితంలో భాగం కావాలని ఆయన ఆకాక్షించారు.

## అంతర్జాతీయ యోగా దినోత్సవం విజయవంతం

నిమ్మనపల్లె, జూన్ 21 ప్రభాతవార్త :

మండల కేంద్రమైన నిమ్మనపల్లెతో పాటు అన్ని గ్రామ పంచాయితీ కేంద్రాల్లో, ప్రభుత్వ పాఠశాలల్లోనూ శనివారం యోగా దినోత్సవాన్ని అత్యంత వైభవంగా జరుపుకొన్నారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిడిఓ పరమేశ్వర్‌రెడ్డి, ఎమ్మార్వోలు, ఎంఈఓ పద్మావతమ్మలతో పాటు మండల, గ్రామస్తాయి అధికారులు యోగా దినోత్సవంలో పాల్గొన్నారు.



ఎంపిడిఓ కార్యాలయంలో యోగా దినోత్సవం

## విద్యార్థులపై బలవంతపు ఫీజుల వసూళ్లపై తగిన చర్యలు తీసుకోవాలి

పీలేరు జూన్ 21 ప్రభాతవార్త :



ఆర్.టి.ఇ విద్యాహక్కు చట్టం 2009 సెక్షన్ 12(1)(సి) ప్రకారం ఉచిత సీట్లు పొందిన విద్యార్థులను వేధిస్తున్న ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాల పై చర్యలు తీసుకోవాలని ఎన్.ఎస్.యూ.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల.అమృత్ తేజ, ఎన్.ఎస్.యూ.ఐ జిల్లా అధ్యక్షులు సాయి సంపత్ కుమార్ మదనపల్లి డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మరియు పీలేరు మండల విద్యా శాఖ అధికారి అయినటువంటి లోకేశ్వర్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అమృత్ తేజ మాట్లాడుతూ గత సంవత్స రం విద్యాహక్కు చట్టం (ఆర్.టి.ఇ) 2009, సెక్షన్ 12(i) (సి) ప్రకారం ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో ఉచితంగా చేరిన విద్యా ర్థులకు 25 రిజర్వేషన్ కింద అడ్మిషన్లు కల్పించబడ్డాయి అని అయితే, కొంతమంది ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఆ విద్యార్థుల తల్లిదండ్ర ులను ఫీజులు కట్టమని వేధిస్తున్నాయి అని తెలియజేశారు. కావున రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అటువంటి పాఠశాలలపై శాఖ పరమైన చర్యలు తీసుకొని ఆ విద్యార్థుల తల్లిదండ్రులకు అండగా నిలవాలని ఎన్.ఎస్.యూ.ఐ తరపున విన్నవించుకున్నట్టు తెలియజేశారు. ఆర్.టి.ఇ కింద అడ్మిషన్ పొందిన విద్యార్థుల పేర్లు గుర్తించి, వారికి ఎటువంటి ఫీజులు విధించరాదని స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలి డిమాండ్ విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు. అదేవిధంగా బాధ్యత తప్పిన యాజమాన్యాలపై గుర్తింపు రద్దు చేసే వరకు చర్యలు తీసుకోవాలి అని డిమాండ్ చేశారు.

## జూన్ 26 న గురుకులాల్లో కౌన్సిలింగ్

ఎడ్యుకేషన్ జూన్ 26 ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ గురుకుల విద్యాలయాలలో 2025,26 విద్యా సంవత్సరానికి గాను మిగిలి వున్నా ఖాళీలు 5వ తరగతి ప్రవేశాల కోసం పరీక్ష రాసిన వారికి ఈ నెల 26న కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్టు జిల్లాసమన్వయ అధికారిఏ. ఉదయ శ్రీ తెలిపారు. ఉదయం 9 గంటలకు ఓపన్ కౌన్సిలింగ్ అమ్మాయిలకు మరియు అబ్బాయిలకు చిన్నచౌక్ లోని గురుకుల పాఠశాలలో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలియజేసారు. సీట్లు మార్చుకోవాలి అనుకున్న వారు సైతం హాజరుకావాలని సూచించారు అదేవిధంగా ఇంటర్ ప్రవేశాల కోసం పరీక్ష రాసిన వారికి ఈ నెల 27న ఉదయం 9 గంటలకు ఓపన్ కౌన్సిలింగ్ అమ్మాయిలకు మరియు అబ్బాయిలకు చిన్నచౌక్ లోని గురుకుల పాఠశాలలో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలియజేసారు. సీట్లు మార్చుకోవాలి అనుకున్న వారు సైతం హాజరుకావాలని సూచించారు.

## రైల్వేకోడూరులో ఘనంగా శ్రీవారి కళ్యాణం



రైల్వేకోడూరు రూరల్, జూన్ 21(ప్రభాత వార్త)::

రైల్వేకోడూరు పట్టణములోని రాజ్ రెసిడెన్సీలో శ్రీవారి కళ్యాణోత్సవ కార్యక్రమాన్ని శెనివారం స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయ ధర్మ కర్త సుదర్శన్ శర్మ తెలిపారు లోక కళ్యాణం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. పట్టణానికి చెందిన ఆర్యవైశ్య నాయకులు కామిశెట్టి బద్రీనాథ్ కుటుంబ సభ్యుల ద్వారా ఈ కళ్యాణం జరిగింది అన్నారు వేద పండితులు శ్రావణ్ కుమార్ మంత్రోచరణా మంగళ వాయిద్యాల నడుమ శ్రీవారి కళ్యాణం కనుల పండుగా జరిగినట్లు సుదర్శన్ శర్మ తెలిపారు భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు కొప్పరపు నరసింహులు పెండ్యాల విజయ్ కుమార్, గుణిశెట్టి రమేష్, కామిశెట్టి పార్ధ సారథి, భగవాన్ గుప్తా తదితరులు పాల్గొని కళ్యాణం అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు.

## టమాటో మార్కెట్‌లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

మదనపల్లిక్రైమ్, జూన్ 21 ప్రభాతవార్త :



టమాటో మార్కెట్ వద్ద ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మదనపల్లి డిఎస్పి మహేంద్ర తెలిపారు. శనివారం వన్ టౌన్, టూ టౌన్ సీఐలతో కలిసి మార్కెట్ను పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ టమాటో మార్కెట్ నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం కావడంతో పాటు, ప్రస్తుతం టమాటో దిగుమతులు అధికం కావడంతో నీరుగట్టువారి పల్లి లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందన్నారు. టమాటా లోడింగ్ తో వచ్చే వాహనాలు సుమారు రెండు కిలోమీటర్ల దూరం వరకు రోడ్డుపై వాహనాలు నిలిచిపోతున్నాయన్నారు. లోడింగ్, అన్‌లోడింగ్ కారణంగా తీవ్ర ట్రాఫిక్ సమస్య వస్తుందన్నారు. ఇందుకోసం టమాట లోడుతో వచ్చే వాహనాలను సమీ పార్టీ పూసలాన్ గ్రౌండ్లో ఏర్పాటు చేసి టోకెన్ సిస్టం ద్వారా ఒక్కొక్కసారి 10 వాహనాలను మాత్రమే మార్కెట్లోకి అనుమతి ఇస్తామన్నారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ట్రాఫిక్ సిబ్బంది ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మార్కెట్‌కు వచ్చే వాహనాలకు సరైన మార్గాలను కేటాయించడం, అనధికార పార్కింగ్‌లను నిరోధించడం, మార్కెట్ లోపల మరియు వెలుపల ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రజలు కూడా సహకరించాలని, నిబంధనలను పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ప్రశాంతత లభించడమే యోగా లక్ష్యం



కె.విపల్లి జూన్ 21 ప్రభాతవార్త:

యోగాసనాలు, ధ్యానము, ప్రాణాయామం సాధన చేయడంతో మనిషి మానసిక ఒత్తిడిని దూరం చేస్తూ ప్రశాంతత లభించడమే యోగా ప్రధాన లక్ష్యమని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 11వ ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా, అన్నమయ్య జిల్లా కె.వి పల్లి మండలం గ్యారంపల్లి గ్రామం గురుకుల పాఠశాలలో పాఠశాల సిబ్బంది విద్యార్థులతో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ యోగా ఆసనాలతో స్థిరంగా ఉండడం, అవయవాలకు మనసుకు మధ్య సమన్వయం మెరుగు పడుతూ, ఏకాగ్రత పెరుగుతుందన్నారు. యోగా ఆసనాలతో ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా మార్చాలని ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు ఆశయమని ఆయన తెలిపారు. శరీరం, ఆత్మల కలయిక దేహాన్ని చైతన్య పరిచి, మనసుకు ఉత్తేజాన్ని కలిగించి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడం యోగా అన్నారు. భారతీయులకు వార సత్వంగా వచ్చిన సంపద లాంటిదని, రకరకాల ఆసనాలు కలిగిన ప్రాచీన విద్య, అమూల్యమైన వరాన్ని భారతదేశం ప్రపంచానికి పరిచయం చేసిందని ఆయన అన్నారు.

## యోగతో సంతృప్తి ఆరోగ్యం



రైల్వేకోడూరు రూరల్, జూన్ 21(ప్రభాత వార్త)::

పట్టణములోని కామిశెట్టి నగర్ లో ఉన్న శ్రీ సాయి బాలాజీ పాఠశాలలో అంతర్జాతీయ యోగ కార్యక్రమాన్ని అధినేతలు పోకల బాబు, ఉప్పలపాటి శ్రీనివాస రాజులు తెలిపారు ఈ కార్యక్రమానికి యోగ గురువు సుబ్బారాయుడు శ్రీ షిరిడీ సాయి కళాశాల అధినేత చెంగల్ రాజులు ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు అనంతరం చిన్నారులు యోగ కార్యక్రమాన్ని అత్యంత అద్భుతంగా నిర్వహించి చూపరులను ఆకట్టుకున్నారు దాదాపు వందలు మంది చిన్నారులు ఈ కార్యక్రమంలో పాల్గొని యోగ గురువుకు చక్కటి ఆధరణ విధంగా పాల్గొన్నారు ప్రతిరోజూ యోగ కార్య క్రమాని నిర్వహించడం ద్వారా మానసిక ఉల్లాసం ఏర్పడుతుంది అని పాఠశాల అధినేతలు పోకల బాబు శ్రీనివాస రాజులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది హెడ్మాస్టర్ వెంకటేశ్వర్లు, వెంకట సుబ్బయ్య, వనజాక్షి ,కళ్యాణి, శివ కుమారి చిన్నారులు పాల్గొన్నారు..

## మామిడి రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదు

రైల్వేకోడూరు రూరల్, జూన్ 21(ప్రభాత వార్త)::



నియోజకవర్గంలోని మామిడి రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని ప్రతి రైతు సీజన్ అయిపోయేంతవరకు ప్రభుత్వం తోతాపురి మామిడికి నాలుగు రూపాయలు చొప్పున సబ్సిడీ అందిస్తుందని ముఖ్యంగా వ్యవసాయ రైతులు ఎటువంటి దిగులు చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం మామిడి రైతులకు అండగా ఉంటుందన్నారు. కాపు ఉన్నంతవరకు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరగా ఇస్తుందన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం సీరియస్ గా తీసుకొని వారికి ఎటువంటి అన్యాయం జరగకుండా చూస్తుందని జాయింట్ కలెక్టర్ రాజేంద్రన్ అన్నారు. అనంతరం శెట్టిగుంటలో ఉన్న మామిడి పండ్ల జ్యూస్ ఫ్యాక్టరీకి ఆయన వెళ్లిపోయారు. వీరి వెంట రైల్వే కోడూరు తాసిల్దార్ అమర్నాథ్, ఎంపీడీవో నాగార్జున, కోడూరు ఉద్యాన వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి మార్చరికి ఫ్రీజర్ బాక్స్ వితరణ

మదనపల్లి క్రైమ్ జూన్ 21 ప్రభాతవార్త.



మదనపల్లికి చెందిన నాగవేణి, ఆమె కుమారుడు తేజస్ లు రు. 95 వేల విలువచేసే ఫ్రీజర్ బాక్సులు మదనపల్లి ప్రభుత్వాసుపత్రికి వితరణగా అందజేశారు. శనివారం ఫ్రీజర్ బాక్స్ మెడికల్ సూపరింటెండెంట్ కు అప్పగించారు. ఈ సందర్భంగా తేజస్ మాట్లాడుతూ తన తండ్రి శివకుమార్ జ్ఞాపకార్థం శ్రీధర్ బాక్సులు మదనపల్లి ప్రభుత్వాసుపత్రి మార్చరీకి ఇవ్వడం జరిగిందన్నారు. మదనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తూ 2000 వ సంవత్సరంలో తమ తండ్రి అనారోగ్యంతో మృతి చెందండం జరిగిందన్నారు. ఆయన జ్ఞాపకార్థం ఫ్రీజర్ బాక్స్ మదనపల్లి వైద్యులకు అప్పగించడం జరిగిందన్నారు. మెడికల్ సూపర్డెంట్ కోటేశ్వరి, ఆర్ ఏం ఓ షుకూర్లు మాట్లాడుతూ దాతలు స్వచ్చందంగా ముందుకు వచ్చి ఫ్రీజర్ బాక్స్ అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నీలకంఠ, ప్రభాకర్, రఘు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రాల సమస్యలను పరిష్కరిస్తాం

ప్రొద్దుటూరు జూన్ 21 ప్రభాతవార్త

నియోజకవర్గం లోని అంగన్వాడి కేంద్రాల సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పేర్కొన్నారు శనివారం స్థానిక డిటిడి కళ్యాణమండపంలో తెలుగు నాడు అంగన్వాడి టీచర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలు గత ప్రభుత్వంలో వారి సమస్యల కోసం ఉద్యమించారని ఆ సమయంలో చంద్రబాబు తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అంగన్వాడీల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారన్నారు. అంగన్వాడీ లు తమకు సెంటర్లకు నేరుగా నాణ్యమైన సరుకులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అంగన్వాడీ లు వారి సమస్యలు తనకు తెలిపితే చంద్రబాబు దృష్టికి తీసుకుని వెళ్తానని. జీతాలు పెంచాలని మీరు కోరిన నేపథ్యంలో ప్రభుత్వంపై పడే భారాన్ని కూడా యోచించి, జిల్లా, రాష్ట్ర అసోసియేషన్ తరపున ప్రభుత్వం దృష్టికి తీసికొని వెళ్లాలని కోరారు. సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం చేస్తే ఫలితం వుంటుంది. అసోసియేషన్ గా కృషి చేస్తే వేగవంతమైన ఫలితాలు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నపిల్లలను, గర్భవతులను అభిమానంతో ఆదరించి, సదుపాయాలు అందించాలన్నారు.



## ఘనంగా యోగా దినోత్సవం



చాపాడు. జూన్ 21. ప్రభాతవార్త :

11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలయందు యోగ దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు యోగా దినోత్సవ వేడుకలకు మండల పరిషత్ అధ్యక్షుడు తెలిదేలా లక్ష్మయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మనస్సు, శరీరం, ఆత్మలను ఏకం చేయడంతోపాటు ఏకాగ్రత, స్వీయనియంత్రనా, యోగ ద్వారా సాధ్యపడుతుందన్నారు. మండల పరిషత్ కార్యాలయం నందు ఎంపీడీవో వీర కిషోర్, తహసీల్దార్ రమాకుమారి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అన్నవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు మండల టిడిపి అధ్యక్షుడు అన్నవరం సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలోయోగ వేడుకలు నిర్వహించారు. అల్లాడుపల్లి గ్రామం నందు పెరుగు వీరనారాయణ యాదవ్ ఆధ్వర్యంలో యోగ కార్యక్రమం నిర్వహించారు. ఈ దినోత్సవ వేడుకలలో ఉపాధి ఏపీవో జగదీశ్వర్ రెడ్డి, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల పాఠశాల ప్రిన్సిపల్ బీరం నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రోజూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

గాలివీడు, జూన్ 21(ప్రభాతవార్త):



రోజూ యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని తహసీల్దార్ భాగ్యలత అన్నారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మండల వ్యాప్తంగా సామూహిక యోగాసనాల సాదన జరిగింది. మండల కేంద్రంలోని గాలివీడు-2 సచివాలయం, పేరంపల్లి, వెలిగల్లు, గోరాన్‌చెరువు, దిగువపల్లె తదితర గ్రామాల్లో అధికారులు యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగాతో క్రమశిక్షణ మెరుగైన జీవన విధానం అలవడుతుందన్నారు. మానసిక సమస్యలు, శారీరక రుగ్మతల నుంచి విముక్తి లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య, విద్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## వాహనదారులకు అవగాహన కార్యక్రమం

రామసముద్రం జూన్ 21 ప్రభాతవార్త



వాహనాలు నడిపే ప్రతి ఒక్కవాహనదారులు మద్యపానం సేవించకుండా రహదారి భద్రత నియమాలు పాటించి వాహనాల నడపాలని ఎస్ఐ రమేష్ బాబు అన్నారు. శనివారం రామసముద్రం మండల కేంద్రంలోని ఆర్ నడింపల్లె గ్రామంలో రహదారి భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై రమేష్ బాబు మాట్లాడుతూ రహదారి ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వాహనాన్ని రహదారి భద్రతా నియమాలు పాటించి నడపాలన్నారు , ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వేగం కన్నా ప్రాణం మిన్న అని చెప్పారు. ప్రతి వాహన దారుడు లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రమేష్ బాబు, పోలీస్ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం,

సిద్ధవటం జూన్ 21 ప్రభాతవార్త



అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా సంపూర్ణ ఆరోగ్యం ను అందించడంతో పాటు సర్వ రోగ నివారిణిల పని చేస్తుందని సిద్ధవటం తాసిల్దార్ ఆకుల తిరుమల బాబు తెలియజేశారు. శనివారం ఉదయం భాకరాపేట జడ్పీ హైస్కూల్ నందు జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం తిరుమల బాబు మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని అలాగే సకల రోగాల నివారణకు యోగ మంచి కార్యక్రమమని తెలిపారు. ప్రతిరోజు ఉదయం కొంత సమయాన్ని యోగాకు కేటాయించడం వల్ల మంచి ఆరోగ్యం పొందుతారని అలాగే యోగా గురువు యోగ విశిష్టతను వివరిస్తూ వివిధ ఆసనాల ప్రాముఖ్యతను విద్యార్థినీ విద్యార్థులకు ప్రజలకు సవి వివరంగా తెలియజేయడం జరిగినది. మన రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరి ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలని ఉద్దేశంతో యోగాంధ్ర కార్యక్రమంతో ప్రతి ఒక్కరిని యోగ వైపు నడిపించి ఆరోగ్యవంతులుగా చేయాలనే గొప్ప కార్యక్రమాన్ని వారన్నారు హై స్కూల్ హెచ్ఎం లక్ష్మీ కేశమ్మ మాట్లాడుతూ యోగ ప్రతిరోజు చేయడం వల్ల ఆరోగ్యవంతులుగా ఉంటారని ప్రతి ఒక్కరూ రోజుకు కొంత సమయాన్ని యోగా కేటాయించాలని యోగా చేయడం వల్ల ఆరోగ్యవంతులుగా ఉండడం జరుగుతుందన్నారు, సి హెచ్ ఓ రాహుల్ మాట్లాడుతూ యోగా చేయడం వల్ల ప్రతి ఒక్కరు ఆరోగ్యం వంతులుగా ఉంటారని వారన్నారు ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పెద్దపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ ప్రతినిధి తుర్ర ప్రతాప్ నాయుడు ఉప సర్పంచ్ ప్రతినిధి నాగం నరసింహారెడ్డి , ఉపాధ్యాయులు, సచివాలయం సిబ్బంది, హెల్త్ సిబ్బంది, ద్వాక్రా సిబ్బంది, గ్రామస్తులు ప్రజలు మరియు విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## యోగ మన జీవన విధానం కావాలి

వేంపల్లి: జూన్ 21 (ప్రభాతవార్త):

యోగ సాధ న మన జీవన విధానం కావాలి అందు లో భాగంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని ఈరోజు ఉదయంఅన్ని ప్రభుత్వప్రైవేట్ పాఠశాలలో నిర్వహించినారు పిల్లలతో కలిసి పిల్లలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రపంచానికి యోగా ప్రక్రియను పరిచయం చేసింది మన దేశమేనని, అందుకు గర్వంగా ఉందని అన్నారు. రోజు యోగా సాధన చేయడం ద్వారా విద్యార్థులు ఏకాగ్రతను, జ్ఞాపకశక్తిని పెంపొందించుకోవచ్చని ఆయన తెలియజేశారుజడ్పీ బాలుర. బాలిక ల. ఉర్దూ అలాగే ఉర్దూ ప్రాధమిక పాఠశాల..చైతన్య. ఉషాకిరణ్. స్వామీవు వేకానంద.తేజ. నారాయణ. ఆయా పాఠశాల కరెస్పాండంట్. హెడమాస్టర్ ఆధ్వారం లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు వ్యాయామ , ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## రీజెన్సీ నలందా కళాశాలలో జాబ్ మేళా



(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)
రాజంపేట రీజెన్సీ నలంద విద్యా సంస్థల ప్రాంగణం లో శనివారం ఉద్యోగ మేళా నిర్వహించారు. ఇంటర్మీడియట్ చదివిన విద్యార్థులకు వ్రాత పరీక్ష నిర్వహించారు. దాదాపు 50 మందికి ఉద్యోగావకాశాలు వున్నవని, ప్రాంగణ డైరెక్టర్ డాక్టర్ బర్ల వెంకటేశ్వర్లు తెలిపారు. హైదరాబాద్ లో ప్రసిద్ది చెందిన కిమ్స్ హాస్పిటల్ తరపున డాక్టర్ ప్రసాద్ వారి బృందం విద్యార్థులకు ఉపాధి కల్పన గురించి వివరించారు. ప్రిన్సిపల్ సుబ్బారాయుడు వారి బృందం పరీక్ష నిర్వహించారు.

## రీజెన్సీ నలందా కళాశాలలో యోగా దినోత్సవం



(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)
రీజెన్సీ నలంద విద్యా సంస్థల ప్రాంగణంలో శనివారం యోగా దినోత్సవాన్ని కన్నుల పండుగ నిర్వహించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ జి ఎన్ నాయుడు విద్యార్థుల మానసిక స్థైర్యాన్ని పెంచే యోగాకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్న ఆదేశాల మేరకు కళాశాలలో యోగా దినోత్సవాన్ని ప్రత్యేక శ్రద్ధతో నిర్వహించారు. చాలా నిర్వహించారు. కళాశాల విద్యతోపాటు విద్యార్థులు మానసికంగా బలోపేతం కావాలని, అందుకు యోగా ఉపయోగపడుతుందని జి. ఎన్. నాయుడు విద్యార్థులకు బోధించారు. ఈ కార్యక్రమంలో కళాశాలకు చెందిన డైరెక్టర్ డాక్టర్ బర్ల వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పండుగలా యోగాంధ్ర



పెనగలూరు జూన్ 21 ప్రభాతవార్త
రాష్ట్రవ్యాప్తంగా జరిగిన కార్యక్రమంలో భాగంగా శనివారం మండల వ్యాప్తంగా యోగాంతర కార్యక్రమం పండుగ వాతావరణం లో జరిగింది. తెల్లవారక ముందే అధికారులు, అనధికారులుతో పాటు రాజకీయ నాయకులు ఉపాధి హామీ కూలీలు సాధారణ ప్రజలు సమీపంలోని గ్రామ సచివాలయాల వద్దకు వెళ్లి యోగాసనాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపీడీవో ఎస్ విజయ రావు పలు గ్రామాలలో యోగాసనాలు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఇదిలా ఉండగా నెలరోజులపాటు గ్రామాలలో యోగాంతర కార్యక్రమం జరగడంతో నెల తర్వాత ఇది కొందరికి అలవాటుగా మారింది. ఇదిలా ఉండగా యోగాసనాల కార్యక్రమం అనంతరం చెట్లు నాటే కార్యక్రమం జరిగింది.

## లక్ష సంతకాల సేకరణ ప్రారంభం



పెనగలూరు జూన్ 21 ప్రభాతవార్త
రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలలోని అపరిస్కృత ఎనిమిది ప్రధాన సమస్యల పరిష్కారమే లక్ష్యంగా శనివారం సిపిఐ నాయకుల ఆధ్వర్యంలో పెనగలూరులో సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభమయ్యింది. లక్ష సంతకాల సేకరణ పత్రాలతో సోమవారం రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదురుగ ప్రజా ప్రదర్శన చేపట్టి అనంతరం సబ్ కలెక్టర్కు వినతి పత్రం ఇవ్వడం జరుగుతుందని మండల సిపిఐ నాయకులు తెలిపారు. నూతన పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, అన్నమయ్య ప్రాజెక్టును పునః నిర్మించాలని, గాలేరు నగరి ప్రాజెక్టు పనులు పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలని, అభివృద్ధిలో వెనుకబడిపోతున్న రైల్వే కోడూరు ఎస్సీ నియోజకవర్గం అభివృద్ధికి ప్రత్యేకంగా 10,000 కోట్లు మంజూరు చేయాలని, తమ ముఖ్యమైన డిమాండ్లుగా సిపిఐ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి జి ఆదినారాయణ, సహాయ కార్యదర్శి బి రాజశేఖర్, ఈరి లక్ష్మీ నారాయణ, కార్యవర్గ సభ్యులు శంకరయ్య, ఓబులేసు, జి సుబ్రహ్మణ్యం, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో యోగా డే కార్యక్రమం




తొండూరు జూన్ 21 ప్రభాతవార్త:
మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు యోగా డే కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది మరియు హై స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అందరూ కలిసి ఉదయం 7 గంటల నుండి 8 గంటల వరకు సుమారు 250 మందితో యోగ ఆసనాలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది అయినా సాయి ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల లో కళాశాల ప్రిన్సిపల్ లెక్చలర్లు విద్యార్థులు సుమారు 60 మంది ఆధ్వర్యంలో యోగ ఆసనాలు వేశారు. యోగ ప్రతి ఒక్కరూ ప్రతిదినము చేయవలసిన కార్యక్రమము అని తెలియజేశారు ప్రపంచ యోగ డే కార్యక్రమంలో అందరూ కలిసి కట్టుగా ముందుకెళ్లాలని సూచించడమైనది.

# లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ చే యోగాడే

(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)
నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఏ.పి. స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, అమరావతి, మరియు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ,కడప,వారి ఆదేశాల మేరకు, రాజంపేట మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ వారి ఆధ్వర్యంలో శనివారం రాజంపేట. వాకర్స్ అసోసియేషన్, రాజంపేట, బార్ అసోసియేషన్, రాజంపేట.ఆడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్. అమెరికా వారి సహకారంతో "అంతర్జాతీయ యోగ దే"జిల్లా పరిషత్ హై స్కూల్ గ్రౌండ్, రాజంపేట లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధులుగా 3వ అడిషనల్ జిల్లా జడ్జి ఎస్. ప్రవీణ్ కుమార్, రాజంపేట, జూనియర్ సివిల్ జడ్జి రాజన్ ఉదయ్ ప్రకాష్ ,పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజా మరియు తిరుపతి, వాసన్ ఐ కేర్ హాస్పిటల్, ప్రముఖ కంటి వైద్యులు ఆనంద్ నాయక్లు పాల్గొన్నారు.వీరు యోగ గురించి మాట్లాడుతూ ప్రతి రోజు యోగాసానాలు చేస్తూ ప్రాణాయామము కూడా అలవాటు చేసుకుంటే ఆరోగ్యంగా ఉంటూ బీపీ, షుగర్,ఇతరత్రా వ్యాధులు నివారించ వచ్చున్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ పాస్ట్ వైస్ ప్రెసిడెంట్ మరియు శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ కొండూరు శరత్ కుమార్ రాజు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించడమైనది. యోగడే సందర్భంగా 300మందికి పైగా వాకర్స్ సభ్యులు, శాన్వి స్కూల్ స్టాఫ్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొని యోగసనాలు గురువు గారు బాలాజీ ద్వారా యోగాభ్యసనలు చేయించారు. రాజంపేట బార్ అసోసియేషన్,అధ్యక్షులు పి.. హనుమంత్ నాయుడు, సెక్రటరీ, జాఫర్ బాషా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వాసన్ ఐ కేర్ హాస్పిటల్ ద్వారా చెకప్ చేసుకున్న కంటి చూపు తక్కువగా ఉన్న 105 మందికి ఉచితంగా కంటి అద్దాలు ఇవ్వడమైనది. వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుబ్బ




రామరాజు, ట్రెజరర్ వెంకటయ్య నాయుడు, అన్న మాయ్యా వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చేజర్ల సుబ్రహ్మణ్యం రాజు, ఆడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ లైసన్ ఆఫీసర్స్ కోనేటిరవిరాజు, అంజనరాజు, శివరామరాజు. వాసన్ ఐ కేర్ హాస్పిటల్ జనరల్ మేనేజర్ సౌకత్ ఆలీ, పి. ఆర్. ఒ వెంకటేష్ మరియు వాకర్స్ మెంబర్స్ రామచంద్ర రాజు, డాక్టర్ జగన్మోహన్, మోహన్ రాజు, సురేష్ రాజు, సుంకు సుధాకర్, శివరాజు,సుబ్బరాజు, నాగరాజా గుప్తా, వాకర్స్ సభ్యులు, న్యాయవాదులు,పోలీస్ సిబ్బందికి, మీడియా మిత్రులకు, పారా లీగల్ ఆర్గనై సర్స్, న్యాయశాఖ సిబ్బంది,డాక్టర్స్, శాన్వి స్కూల్ స్టాఫ్, పట్టణ ప్రజలు పాల్గొని యోగడే ఘనంగా నిర్వహించి వచ్చినవారికి అల్పాహారం ఇవ్వడమైనది. శరత్ కుమార్ రాజు వచ్చిన అతిధులకు ఘనంగా తలపాగ పెట్టి దుస్సాలువలతో సన్మానించడమైనది.

## గుర్రంకొండలో యోగా డే




గుర్రంకొండ, జూన్ 21, ప్రభాతవార్త
మండలంలోని అన్ని గ్రామాలలో యోగా దేను విధిగా నిర్వహించారు. శనివారం ఉదయం 7గంటల నుండీ యోగాను అన్ని గ్రామాలలో నాయకులు, అధికారులు అధ్వర్యంలో నిర్వహించారు. యోగా చేయడం వలన కలిగే ఉపయోగాలను ప్రజలకు తెలియజేస్తూ ఆసనాలు చేయించారు. ఈ యోగా కార్యక్రమంలో యువత నుండీ వృద్ధుల వరకూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది. యోగాతో మనుషులకు ఆరోగ్యంతోపాటు, ప్రతి అవయవాల కదలికలతో ఎంతో ఉత్సాహంగా వుంటారు. గుర్రంకొండ జూనియర్ కళాశాలలో మండల టిడిపి అధ్యక్షులు నాయిని జగదీష్కుమార్ అధ్వర్యంలో, ఎల్లుట్లలో యస్. మురళీ కృష్ణ అధ్వర్యంలో, మర్రిమాకులపల్లిలో మాజీ సర్పంచ్ యన్. రెడ్డెప్పరెడ్డి, మార్కెట్ కమిటి డైరెక్టర్ బయ్యారెడ్డిల అధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తరిగొండలో మార్కెట్కమిటి వైస్చైర్మన్ యస్. నౌషాద్అలి, డైరెక్టర్లు సుధాభారతి, బాబ్జాన్, బి. రాధ, యన్. అరుణకుమారి,నాయకులు శ్రీరాములు, ప్రకాష్, సర్వేయర్ సురేంద్రబాబు, కార్యదర్శి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్ను సద్వినియోగం చేసుకోవాలి



పోలీసులతో మాట్లాడుతున్న జిల్లా అదనకు జడ్జి మహేష్

పీలేరు జూన్ 21 ప్రభాతవార్త :
లోక్ అదాలత్ సేవలను కచ్చి దారులు సద్వినియోగం చేసుకునేలా పోలీసులు వారిని ప్రోత్సహించాలని పీలేరు 11వ అదనపు జిల్లా జడ్జి ఏ. మహేష్ తెలిపారు. శనివారం స్థానిక 11వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో, న్యాయస్థానం పరిధిలోని ఆరు మండలాలకు చెందిన పోలీసులు, ఎక్సైజ్ మరియు ప్రొహిబిషన్స్ అధికారులతో, జూలై 5న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా సూచించారు. ముఖ్యంగా లోక్ అదాలత్ కు అధిక సంఖ్యలో కేసులు తీసుకువచ్చి వాటిని పరిష్కరించుకునేలా కచ్చి దారులను ప్రోత్సహించాలని ఆదేశించారు. గతంలో పీలేరు లోక్ అదాలత్ నుంచి రాజీమార్గంలో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేవని, ఇప్పుడు వాటి సంఖ్య తగ్గకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్. శ్రీనివాస్, పీలేరు సిఐ యుగంధర్, ఎస్సై లోకేష్, భాకరాపేట ఎస్సై రాఘవేంద్ర, ఎర్రావారిపాలెం, రొంపిచర్ల, సదుం, కెవి పల్లి పోలీస్ స్టేషన్లో నుంచి ఏఎస్ఐలు, పీలేరు, పులిచెర్ల, చంద్రగిరి ఎక్సైజ్, ప్రొహిబిషన్స్ పి. లక్ష్మీ నరసయ్య, భాస్కర్ రెడ్డి, ఎం. సుధాకర్ రావు, పోలీసు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## యోగాను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలి

పీలేరు జూన్ 21 ప్రభాతవార్త :
యోగాను ప్రతి ఇంటా, ప్రతి ఒక్కరూ యోగాను అలవర్చుకోవాలని పీలేరు 11వ అదనపు జిల్లా జడ్జి ఏ. మహేష్ తెలిపారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర హైకోర్టు, చిత్తూరు జిల్లా కోర్టుల ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం స్థానిక కోర్టు ఆవరణంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులు, సిబ్బంది యోగాసనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ యోగ మనిషిని అధిక ఒత్తిడి నుంచి రక్షిస్తూ ఆరోగ్యంగా ఉండడానికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఇందుకోసం అందరూ యోగాసనాలు విధిగా చేయాలని, దీన్ని దినచర్యలో ఓ భాగంగా అలవాటు చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. శ్రీనివాసు, స్పెషల్ జుడీసిల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ మురళి, కోర్టు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



యోగా చేస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

## ఏవో కు ప్రశంసా పత్రం

పీలేరు జూన్ 21 ప్రభాతవార్త :



గతంలో పీలేరు తహసిల్దారుగా పనిచేసి ప్రస్తుతం కలెక్టరేట్లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్గా పనిచేస్తున్న భీమేశ్వరరావును రెవిన్యూ దినోత్సవ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రతోపాటు పలువులు జిల్లా అధికారులు భీమేశ్వరరావు ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా ప్రభాతవార్తతో భీమేశ్వరరావు మాట్లాడుతూ పేద ప్రజలకు జననం నుండి మరణం వరకు పొందే సర్టిఫికెట్లలో రెవెన్యూ అధికారుల పాత్ర కీలకమని ఎవరికి ఇబ్బంది కలగకుండా పని చేయటం వలన రెవెన్యూ దినోత్సవం రోజు జిల్లా ఉన్నతాధికారులు సన్మానించడం జరిగిందని సన్మానముతో మరింత బాధ్యత పెరిగిందని ఉద్యోగ బాధ్యతలు ఉన్నంతవరకు ఉన్నతాధి కారుల సూచనలతో నా కర్తవ్యాన్ని పేద ప్రజల కోసం పనిచేస్తానని ఆయన అన్నారు.

## మతిస్థిమితం లేక యువకుడు ఆత్మహత్య.

తంబళ్లపల్లె జూన్ 21 ప్రభాతవార్త ః
ఓ యువకుడు మతిస్థిమితం లేక ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో వెలుగు చూసింది. మండలంలోని మర్రిమాకులపల్లి పంచాయతీ కు చెందిన కృష్ణమనాయుడు కుమారుడు భూపతి నాయుడు(30) మానసిక పరిస్థితి సరిగా లేక మంగళవారం తమ వ్యవసాయ బోరు వద్ద చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందాడు. శనివారం బోరు బావి వద్దకు పొలానికి నీరు వదలడానికి వెళ్లిన కుటుంబ సభ్యులకు భూపతి నాయుడు చెట్టుకు ఉరి వేసుకుని చనిపోయిన విషయం తెలుసుకొని పోలీసులకు సమాచారం అందించారు. స్థానిక ఏఎస్ఐ నరసింహులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహానికి పంచనామా నిర్వహించి అనంతరం పోస్టుమార్టం నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## జీవనశైలిలో యోగాను నిర్వహించాలి



యోగా నిర్వహిస్తున్న దృశ్యం

కురబలకోట, జూన్ 21 ప్రభాతవార్త :
యోగాను జీవనశైలిలో భాగంగా చేసుకొని రోజూ నిర్వహించాలని మిట్స్ కళాశాల వైస్ప్రిన్సిపాల్ డాక్టర్ రామనాథన్ అన్నారు. శనివారం మిట్స్ కళాశాలలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజూ నిర్వహించడం వల్ల మానసిక ఆరోగ్యం మెరుగుపడి అధ్యాత్మిక వైపు చూపుతుందని అన్నారు. పిఎం నరేంద్రమోడీ, సిఎం చంద్రబాబునాయుడులు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యోగాంద్రా 2025 కార్యక్రమాన్ని మదనపల్లె, హార్సిలీహిల్స్, మిట్స్ కళాశాలలో మే 21 నుంచి జూన్ 21వరకు నిర్వహించినట్లు తెలిపారు. కళాశాల యోగా ట్రైనర్ డాక్టర్ దామోధరం మాట్లాడుతూ యోగా కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదు సంతులిత జీవనానికి మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు యోగాసనాలు, ప్రాణాయామాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పి.రాజేష్, మంజువిక్రం, పీడి డాక్టర్ దామోదరం తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులకు సంక్షేమ పథకాల్లకు ఎంపిక

కురబలకోట, జూన్ 21 ప్రభాతవార్త :



వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

గిరిజనులకు సంక్షేమ పథకాలు అందజేసేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ధాత్రి అభాజన్ జాతీయ గ్రామ విత్కర్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులను శనివారం మండల అధికారుల బృందం ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించింది. తెట్టు, దొమ్మన్నబావి నాగలాపుర, మంద్యవారిపల్లె, ఎగువపత్తివారిపల్లెల్లోని అర్హులైన గిరిజనులకు ఆధార్కార్డు, రేషన్కార్డు, ఆయుస్మాన్భారత్కార్డులు, కిషాన్క్రిడిల్కార్డు, ఆదాయ, కులసర్టిఫికెట్లు తదితర సేవలను అందించేందుకు ఎంపిక చేశారు. ఈనెల 18నుంచి 27వరకు వారికి 69 మందికి ఆయుష్మాన్భారత్, కులసర్టిఫికెట్లు 8మందికి పిఎంజేఏవై 38మందికి సర్టిఫికెట్లు ఇచ్చేందుకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఆ గ్రామాల్లో గిరిజనులకు ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ గంగయ్య, డిప్యూటి ఈఓఆర్డి అశ్విని, పంచాయతీకార్యదర్శి రామప్ప, వైద్య, విద్య తదితర అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## యోగా ఆరోగ్య ప్రదాయిని

కురబలకోట, జూన్ 21 ప్రభాతవార్త :
మండలంలో శనివారం యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వ పాఠశాలలు, గ్రామ పంచాయితీల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపి మేజారి తిమ్మరాయుడు మాట్లాడుతూ తంబళ్లపల్లె టిడిపి ఇన్చార్జ్ జయచంద్రారెడ్డి ఆదేశాల మేరకు చింతమాకులపల్లె గ్రామ సచివాలయం వద్ద యోగా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి టిడిపి నాయకులు వెంకటరెడ్డి, సిద్దల శివారెడ్డి, గంగిరెడ్డి, వెంకటేష్, మేజారి గోపా లక్రిష్ణ, కనుగొండ వెంకటరమణారెడ్డి, గ్రామ కమిటీ కార్యదర్శి ఉదయ్కు మార్, గ్రామ సెక్రటరీ సిద్దల హరిప్రసాద్రెడ్డి, సచివాలయ సిబ్బంది, అంగన్ వాడీలు, మహిళా గ్రూపుసభ్యులు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బిక్షాటనతో వినూత్న నిరసన

18వ రోజు కొనసాగిన కార్మికుల సమ్మె



భిక్షాటన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

మదనపల్లె, జూన్ 21 ప్రభాతవార్త :
అర్ధనగ్న ప్రదర్శనతో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు బిక్షాటన చేసి వినూత్న తరహాలో నిరసన వ్యక్తం చేశారు. శనివారం సమ్మె కార్యక్రమంలో భాగంగా 18వ రోజు అర్ధనగ్న ప్రదర్శనతో కార్మికుల సమ్మె కొనసాగింది. ఈ సమ్మె కార్యక్రమంలో జేఏసి నాయకులు ఎంఎస్.కన్నయ్య మాట్లాడుతూ 22 నుండి మున్సిపల్ కార్మికులు పూర్తిస్థాయిలో విధులు బహిష్కరించి సమ్మెకు దిగుతారన్నారు. ఇందులో భాగంగానే సబ్కలెక్టర్, డిఎస్పి, మున్సిపల్ కమీషనర్లకు సమ్మె నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటిల్లోనూ 48రోజులుగా శాంతియుత సమ్మె నిరసన చేస్తున్నా ప్రభుత్వం ఏమీ పట్టనట్లు వ్యవహరి స్తొందన్నారు. ప్రభుత్వం ఇంజనీరింగ్ కార్మికులకు అన్యాయం చేస్తున్నదన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా, ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు కూడా రాకుండా అన్యాయం చేస్తొందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరుజిల్లా ఇంజనీరింగ్ కార్మికులు జేఏసి అధ్యక్షులు ఎస్కె.రెడ్డప్ప, జేఏసి నాయకులు ఎంఎస్ ఎస్.కన్నయ్య, నాగరాజు, గోపాల్క్రిష్ణ, సజార్కుమార్, మహేష్, ఇంజనీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

## వైకాపా బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలి

నాయకులకు మాజీ మంత్రి, ఎంపి సూచనలు



మాజీ మంత్రిని కలిసిన నాయకులు

మదనపల్లె, జూన్ 21 ప్రభాతవార్త :
వైఎస్ఆర్ కాంగ్రెస్పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపి మిథున్రెడ్డిలు సూచించారు. శనివారం నియోజకవర్గ ఇన్చార్జ్ నిస్సార్అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ నరేష్ కుమార్రెడ్డిల ఆధ్వర్యంలో నాయకులు తిరుపతిలో వారిని కలిశారు. ఈ సందర్భంగా వారు నియోజకవర్గంలో వైకాపా పటిష్టానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ముఖ్యంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి పెట్టి వైకాపా అభ్యర్థులు గెలుపొందేందుకు కృషి చేయాలన్నారు. గ్రామస్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుపుకొని పార్టీ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఏడాదిలో కూటమి ప్రభుత్వం విఫలం చెందిన విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలన్నారు. ప్రజావ్యతిరేక విధానాలను కూడా ప్రజలకు వివరించి పార్టీని గ్రామస్థాయి నుంచి పటిష్టపరచాలన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రిని, ఎంపిని శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు వివిఎస్.రెడ్డి, ఆవుల మల్లికార్జున, రమేష్, రఘునాథ్రెడ్డి, మహేశ్వర్రెడ్డి, శంకర, వెంకటేష్, రాఘవ, హరినాథ్, ప్రసాద్, దినకర్లు పాల్గొన్నారు.

## వెలుగుస్కూల్లో ఘనంగా యోగా డే



యోగా నిర్వహిస్తున్న దృశ్యం

మదనపల్లె, జూన్ 21 ప్రభాతవార్త :
పట్టణ సమీపంలోని అమ్మచెరువుమిట్ట వద్ద ఉన్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో శనివారం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వెలుగుస్కూల్ సెక్రటరీ ఉదయ్మోహన్రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మిల ఆధ్వర్యంలో యోగాడేను నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా మదనపల్లె తాలూకా సిఐ కళా వెంకటరమణ హాజరై యోగాయొక్క ప్రాముఖ్యతను వృద్దులకు, బుద్దిమాంద్యుల పిల్లలకు వివరించారు. ప్రతి ఒక్కరూ యోగాను విధిగా చేసి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. నెలరోజులు పాటు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పాఠశాలలో యోగాను నిర్వహించడం పట్ల ఆయన వెలుగుస్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. అనంతరం వెలుగుస్కూల్సెక్రటరీ, కన్వీనర్, ప్రిన్సిపాల్ లీనాకుమారిలు సిఐకు శాలువ కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## అధిక ఫీజుల వసూళ్ళపై ఫిర్యాదు



డివైఈఓకు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

మదనపల్లె, జూన్ 21 ప్రభాతవార్త :
పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల చేత అధికఫీజులు వసూళ్ళు చేస్తున్నారంటూ బివైఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు పునిత్ శనివారం డివైఈఓ లోకేశ్వర్రెడ్డికు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బహుజనయువసేన అధ్యక్షులు పునిత్ మాట్లాడుతూ మదనపల్లె పరిధిలో ఉన్న ప్రైమరీస్కూల్స్, ప్లేక్లాస్ నుంచి 1వ తరగతి వరకు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధగా ఎల్కెజి పిల్లలకు రూ.35వేలు నుంచి 50వేల వరకు పీజు వసూలుచేస్తూ తల్లిదండ్రులను దోపిడి చేస్తున్నారన్నారు. ఫీజుల పేరుతోనే కాకుండా స్నాక్స్, యాక్టివిట్స్ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. పాఠశాలల్లో కూడా అర్హత లేని ఉపాధ్యాయులచే విద్యాబోధన చేయిస్తున్నారన్నారు. పలు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధగా నడుస్తున్నాయన్నారు. అన్ని పాఠశాలలను పరిశీలించి నిబంధనలకు విరుద్దంగా నడుపుతున్న పాఠశాలలపైచర్యలు తీసుకొని అధిక ఫీజుల దోపిడి విదానాన్ని అరికట్టాలని ఆయన కోరారు. లేనిపక్షంలో నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు హరీష్, జిలాని బాషా, శశికుమార్, హరిక్రిష్ణ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## యోగాతో.. సంపూర్ణ ఆరోగ్యం..

ఓబులవారిపల్లి జూన్ 21 ప్రభాతవార్త
యోగాతో వ్యక్తిగత ఆరోగ్యం సంపూర్ణంగా సిద్ధిస్తుందని కూడా చైర్మన్ టిడిపి ఇన్చార్జి ముక్కారూపానంద రెడ్డి అన్నారు శనివారం నేషనల్ యోగ దినోత్సవం సందర్భంగా ఆయన ముఖ వారి పల్లి హైస్కూల్లో యోగా కార్యక్రమంలో పాల్గొని అందరిని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా ప్రతి వ్యక్తికి వ్యక్తిగత జీవితంలో ఒక సాధనం అని ఇలా చేయడం వల్ల మనిషి సంపూర్ణ ఆరోగ్యంతో పాటు ఆహ్లాదకరంగా ఉండి మనసు ప్రశాంతతగా మెదడు బాగా పనిచేసే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండడంతో పాటు అన్ని సర్వ లక్షణాలు కలిగి ఉండి అభివృద్ధి చెందింది మంచి కార్యక్రమాలు చేపట్టేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన సూచించారు

## టిప్పర్ ను ఢీకొన్న ద్విచక్ర వాహనం... ద్విచక్ర వాహనదారునికి తీవ్ర గాయాలు

ముద్దనూరు, జూన్ 21, ప్రభాతవార్త:
పట్టణ పరిధిలోని తాడిపత్రి కడప ప్రధాన జాతీయ రహదారిలో శనివారం నాడు ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం టిప్పర్ ను ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనదారునికి తీవ్ర గాయాలైన ఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం కొత్త బస్టాండ్ వైపు నుంచి టిప్పర్ తాడిపత్రి వైపుకు మలుపు తిప్పుతుండగా ఎర్రగుంట్ల వైపుకు వెళుతున్న సిరాజ్ పల్లె గ్రామానికి చెందిన పవన్ కుమార్ రెడ్డి ప్రస్తుత ముద్దనూరు టౌన్ లో నివాసం ఉండి, సొంత గ్రామానికి వెళుతుండగా ప్రమాదవశాత్తు టిప్పర్ ను ఢీకొనడంతో తలకు గాయాలయ్యి, కాలు కు తీవ్ర గాయాలు గాయమైనట్లు పేర్కొన్నారు. హుటాహుటిన ప్రైవేట్ వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు స్థానికులు వివరించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఘటనకు గల కారణాలను పరిశీలిస్తున్నారు.



# చెన్నంపల్లి ప్రైమరీ మోడల్ స్కూల్ నందు చిన్నారులచే యోగ ఆసనాలు..!





బద్వేల్ జూన్ 21 ప్రభాతవార్త :

చెన్నంపల్లి ప్రైమరీ మోడల్ స్కూల్ నందు చిన్నారులచే యోగ ఆసనాలను ప్రపంచ యోగా దినోత్సవం కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం 6 గంటలకు పధానోపాధ్యాయులు షామీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయుడు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే యోగ ఆసనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం వల్ల విద్యార్థులకు మేధోసంపతీ వారి సొంతం అవుతుందన్నారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు చిన్నారులచే యోగ ఆసనాలు కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. యోగ ఆసనాలు చెప్పే విషయాన్ని విద్యార్థులు ఆసక్తిగా గమనించి ఎంతో చక్కగా యోగ ఆసనాలు చేయడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు కార్యక్రమాన్ని చేపట్టిన ఉపాధ్యాయులను అభినందించారు. రానున్న రోజులలో ప్రతిరోజు కొంత సమయం కేటాయించి విద్యార్థులకు యోగ చేయడం వల్ల వచ్చు ఆరోగ్య సమస్యలు తలెత్తవని వివరిస్తూ విద్యార్థులచే యోగ ఆసనాలు నిర్వహించేందుకు తమ వంతు బాధ్యతగా ప్రయత్నిస్తానన్నారు. అదేవిధంగా యోగ కార్యక్రమం చేపట్టినప్పటి నుంచి ముగిసే అంతవరకు విద్యార్థులు క్రమశిక్షణతో ఉపాధ్యాయులు చెప్పే సూచనలతో యోగాసనాల కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేశారు. విద్యార్థులకు ఉదయాన్నే ఉపాధ్యాయులు యోగా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు అల్పాహార విందు అనంతరం పాఠశాల లోని పాఠశాల ముగింపు సమయాన విద్యార్థులకు విద్యార్థులకు మధ్యాహ్నం భోజన వసతి ఏర్పాటు చేశారు. అనంతరం విద్యార్థులకు ప్రతి ఒక్కరికి ఉపాధ్యాయులు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నాగ పార్వతి, శారదా దేవి ,లక్ష్మీనరసయ్య అదేవిధంగా విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# యోగాసనాల్లో పాల్గొందాం ఆరోగ్యాలను కాపాడుకుందాం






ఒంటిమిట్ట జూన్ 21( ప్రభాతవార్త)

ప్రపంచ యోగా దినోత్సవం పురస్కరించుకొని ప్రజలందరూ మానసికంగా ఆహ్లాదకరంగా ఉండి దేహదారుఢ్యం పెంపొందించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం యోగా కార్యక్రమం తలపెట్టిన నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం ఉదయం శ్రీ కోదండ రామస్వామి ఆలయ దక్షిణ భాగంలోని ఉద్యానవనంలో మండల ఉన్నతాధికారులు యోగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు యోగాలో పాల్గొన్న ప్రజలతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ దేహ దారుఢ్యం కలిగి ఉండేందుకు యోగాసనం అనే చక్కని కార్యక్రమం తలపెట్టినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ముందుగా కృతజ్ఞతలు తెలియజేశారు. యోగా కార్యక్రమం నిర్వహించేందుకు ఆధ్యాత్మికత భావనలు కలిగించేందుకు దేవాలయాలు, ఉద్యానవనాలు నిలయంగా ఉంటాయని యోగాసనాలు చేయడం వల్ల మనసు ప్రశాంతత కలిగి శరీరంలోని భాగాలన్నీ దృఢంగా ఉండేందుకు అనుకూలంగా ఉంటుందని రోగ నిరోధక శక్తిని పెంచుకొని బ్రతికినంత కాలం ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. యోగాసనాల ప్రక్రియ ఋషుల నుంచి సంక్రమించిందని ఆహార అలవాట్లు, జీవన విధానం, ఇవన్నీ యోగాలో ఒక భాగం అన్నారు. ప్రస్తుతం యువత యోగాలో ఆసక్తి కనబరచడంపై సంతోషం వ్యక్తం చేశారు. యోగా మనిషి యొక్క జీవన విధానానికి ,శరీర దారుఢ్యతకు ,మానసిక ఉల్లాసానికి, మనసు ప్రశాంతతకు, గట్టి పునాది అవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల ప్రకారం గ్రామాల్లోని ప్రతి పాఠశాలల్లో అధ్యాపకులు విద్యార్థులతో యోగా నిర్వహించడం పరిపాటిగా చేసుకోవాలన్నారు. రోజువారి ప్రజా జీవితంలో కచ్చితంగా యోగా కలుపుకోవాలన్నారు. యోగ సూత్రాలను నియమాలను పాటించాలన్నారు. దైవచింతన కలిగేందుకు యోగ ఒక కవచంలా ఉపయోగపడుతుందన్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు యోగ పై ఆసక్తి కనపరిచి ప్రేరణ కలిగించే విధంగా యోగాసన పద్ధతులను ఆచరణలో పెట్టి ముందుకు సాగాలన్నారు. అందుకోసం నేటి యువత ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకంగా నిలిచి యోగ పై పట్టు సాధించాలన్నారు. మన పూర్వీకులు, ఋషులు యోగాసనాల రూపంలో అందించిన విలువైన సంపదను జీవన విధానాన్ని బట్టి వాతావరణంలో కలిగే మార్పుల దృష్ట్యా ప్రస్తుతం యోగాసనాలను నేర్చుకొని ఆదర్శంగా నిలిచి భావితరాలకు తెలపాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ కోదండ రామాలయం అర్చకులు వీణా. రాఘవాచార్యులు, ఒంటిమిట్ట తాసిల్దార్ దామోదర్ రెడ్డి, డిప్యూటీ తాసిల్దార్ అంజన గౌరి, స్పెషల్ ఆఫీసర్ బ్రహ్మయ్య, ఎంపీడీవో సుజాత, పిఠపిఆర్డి ప్రసాద్, ఎంఈఓ వెంకటసుబ్బయ్య, ఎంపీపీ లక్ష్మీదేవి, మండల రాజకీయ నాయకులు నల్లగొండ. వెంకటసుబ్బారెడ్డి, పాటూరి. గంగిరెడ్డి, కట్ట .యానాదయ్య, భాను ప్రకాష్ రాజు, ఆశా వర్కర్లు, అంగన్వాడీలు, తదితర మండలాధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

## ఆసుపత్రిలో పిచ్చి మొక్కలు తొలగింపు



పోరుమామిళ్ల రూరల్, జూన్ 21 ప్రభాతవార్త:

పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రి లో పోస్టుమార్టం రూమ్ పరిసర ప్రాంతాలలో పిచ్చి మొక్కలు పెరిగి విషపురుగులకు నిలయమై సిబ్బందికి, రోగులకు ఇబ్బందికరమైన పరిస్థితి రంగసముద్రం పంచాయతీ సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి దృష్టికి తీసుకురాగా వీరి ఆదేశాలు మేరకు శనివారం వార్డు మెంబర్ భర్త తులసి సురేష్ బాబు , రంగసముద్రం పంచాయతీ సిబ్బంది ఆ పరిసర ప్రాంతాలలో ఉన్న పిచ్చిమొక్క లను తొలగించి శుభ్రపరిచారు. కోరిన వెంటనే స్పందించిన పంచాయతీ వారికి పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది ధన్యవాదాలు తెలియజేశారు.

## 11 వ అంతర్జాతీయ యోగ వేడుక

బ్రహ్మం గారి మఠం జూన్ 21 ప్రభాతవార్త:




11 వ అంతర్జాతీయ యోగ డే ప్రారంభోత్సవం ముందుగా ఎంపీపీ వీరనారాయణ రెడ్డి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మల్లికార్జునరావు, జడ్పీ హై స్కూల్ హెడ్మాస్టర్ ప్రతాపరెడ్డి ఆయుర్వేదిక్ మెడికల్ ఆఫీసర్ డా. పల్లామహేష్ ,టీడీపీ మండలాధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు శీలం.నరసింహ గౌడ్ , సాంబశివరెడ్డి పూజ.శివయ్య,నాగయ్య యోగ మాస్టర్ పత్తి .సురేష్ తదితరులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన తో ప్రారంభం చేశారు.. ఈ కార్యక్రమంలో మఠం మండల ప్రజాప్రతినిధులు, జడ్పీ హై స్కూల్ విద్యార్థులు, వెలుగు సిబ్బంది, సచివాలయం సిబ్బంది, వెలుగు ,డ్వాక్రా మహిళలు, పాత్రికేయులు ,పోలీసు సిబ్బంది తదితరులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రోగ్రాం నీ విజయవంతం చేశారు..ఈ ప్రోగ్రాం నందు ఎంపీపీ వీరణరాయణ రెడ్డి మాట్లాడుతూ యోగ ప్రతి ఒక్కరి జీవన విధానంలో భాగం కావాలి అని తెలియజేశారు. అదే విధంగా యోగ కాంపిటీషన్ లో పాల్గొన్న విద్యార్థులకు, నెల రోజుల పాటు ట్రైనింగ్ ఇచ్చిన మాస్టర్ ట్రైనర్ లకి కేంద్రం విడుదల చేసిన ట్రైనింగ్ సర్టిఫికెట్లు ఎంపిపి వీరనారాయన రెడ్డి మరియు టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్బారెడ్డి, జారీ చేశారు.

## యువత పోరును విజయవంతం చేయాలి

పోరుమామిళ్ల రూరల్, జూన్ 21 ప్రభాతవార్త:

నిరుద్యోగుల పక్షాన నిలుస్తూ ఈనెల 23వ తేదీన కడప కలెక్టరేట్ వద్ద నిర్వహించే యువత పోరు ధర్నాను విజయవంతం చేయాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి గారు పిలుపునిచ్చారు. శనివారం పోరుమామిళ్ల పార్టీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా పార్టీ అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో జరగబోయే యువత పోర్మ పోస్టర్లు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి యువజన విభాగం ఎంతో కీలకమని అన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల గురించే ఆలోచిస్తుందని తెలిపారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలు మోసానికి గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు చిత్తా గిరి ప్రణీత్ రెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షులు సాయి నారాయణ రెడ్డి, జిల్లా యువజన విభాగ కార్యవర్గ సభ్యుడు జగదీష్ రెడ్డి, మండల వాలంటరీ వింగ్ అధ్యక్షులు శివ, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు పొదిలి మస్తాన్ మనీ, జిల్లా విద్యార్థి విభాగం ఎగ్జిక్యూటివ్ నెంబర్ కే శివకుమార్, సెల్ పాయింట్ భాష, రసూల్, వెంకటేష్, ఆది బోయిన శ్రీకాంత్ యాదవ్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ యోగా దినోత్సవం




కలికిరి, జూన్ 21, ప్రభాతవార్త:

కలికిరి మండలంలోని 14 గ్రామ పంచాయతీలలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాల్లో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా జరిగింది. కలికిరి మండలంలో ఎంపీడీవో భానుమూర్తిరావు పర్యవేక్షణలో అన్ని గ్రామ వార్డు సచివాలయాల్లో స్థానిక సర్పంచులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, వెలుగు శాఖల అధికారుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో 14 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారులను నియమించడం జరిగింది. దీంతో కలికిరిలో శనివారం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో, సచివాలయాల్లో యోగా దినోత్సవం నిర్వహించి అధికారులు, ప్రజా ప్రతినిధులు స్థానిక ప్రజలతో యోగాసనాలు చేయించి యోగా చేయడం వల్ల కలిగే లాభాలు వివరించారు. కలికిరిలో ఎంపీడీవో భానుమూర్తిరావు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది యోగాసనాలు చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మర్రికుంటపల్లె పంచాయతీలో స్థానిక సర్పంచ్ ఎ.రెడ్డిరామ్, పంచాయతీ కార్యదర్శి నవాజుల్లా, వీఆర్వో సురేష్ కుమార్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి యోగాసనాలు చేయడం జరిగింది. పల్లఓలు పంచాయతీలో ఉపాధి హామీ పథకం ఏపీవో మంజుల ప్రత్యేక అదికారిగా అంతర్జాతీయ యోగాంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మహల్ పంచాయతీలో జరిగిన అంతర్జాతీయ యోగా కార్యక్రమానికి తెదేపా సీనియర్ నాయకులు మహ్మద్ అలీ, కలికిరి మండలం టీడీపీ మైనార్టీ అధ్యక్షులు మున్వర్ అలీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ ముజీబర్ రెహమాన్, ఈవోఆర్డీ మహ్మద్ రియాజుద్దీన్, ఎంపీడీవో కార్యాలయం అడ్మినిస్ట్రేషన్ అధికారి సురేంద్ర బాబు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అరుంధతి, సత్తాజ్, వెలుగు సీసీలు, సంఘ మిత్రలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పెండ్లిమర్రి, జూన్ 21, ప్రభాతవార్త:

11వ అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని వెల్లటూరు హైస్కూల్లో, పెండ్లిమర్రి కళాశాలలో విద్యార్థులతో యోగాంధ్ర కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. యోగాసనాలతో సనాతన ధర్మంతో వెల్లువిరిసింది. మన జీవితంలో యోగా దైవందినంలో భాగమైతే మానసిక వికాసం, ఆరోగ్యం విరజిల్లుతుంది. విశాఖ సముద్ర తీరంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబునాయుడు, పలువురు ముఖ్య నేతలు పెద్ద ఎత్తున యోగాంధ్ర నిర్వహించారు. అక్కడి నుంచి జిల్లా, మండల స్థాయిలో ప్రసారాల ద్వారా యోగాసనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, ప్రిన్సిపల్ ఇంద్ర, ఎంఈవో సుజాత, మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, స్కూలు విద్యార్థులు, ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## అట్టహాసంగా యోగాంధ్ర కార్యక్రమం



పీలేరు జూన్ 21 ప్రభాతవార్త :

పీలేరులో యోగాంధ్ర కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లక్ష్యంగా చేపట్టిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పీలేరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానం, ప్రభుత్వ ఉన్నత పాంశాల ఆవరణం, గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామ్మూర్తి పంచాయతీ అధికారులు స్వచ్ఛందపై నినాదాలు పరిసరాల శుభ్రత మనందరి బాధ్యత అంటూ ప్రమాణాలు చేశారు. అలాగే ఫారెస్ట్ కార్యాలయంలో ఫారెస్ట్ సిబ్బంది అధికారులు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో ఎం వి ఐ విజయ్ కుమారి యోగేంద్ర కార్యక్రమం నిర్వహించారు. అలాగే పలు ప్రాంతాల్లో యోగాంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని అధికారులు విజయవంతంగా నిర్వహించారు. స్థానిక జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన కార్యక్రమానికి ఉద్యాన శాఖ అధికారి సుకుమార్ రెడ్డి ప్రత్యేక అధికారిగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పీలేరు డివిజన్ అగ్రికల్చర్ ఏడి వై వి రమణ రావు, రాయచోటి ఏడి శ్రీలత, సచివాలయ కార్యదర్శిలు బాబాజాన్, గీత, తదితరులు పాల్గొన్నారు. అలాగే పంచాయతీ కార్యాలయం ఆవరణంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎంపీడీవో శివశంకర్, తహశీల్దారు శివకుమార్, పంచాయితీ ఇంచార్జ్ ఈవో, డిప్యూటీ ఎంపీడీవో లతీఫ్ ఖాన్, ఐసిడిఎస్ పీలేరు ప్రాజెక్టు సిడిపిఓ రాజమ్మ, ఇతర అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## యోగా ప్రతి ఒక్కరి జీవనశైలిలో భాగం చేసుకోవాలి

### ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పిలుపు



ప్రొద్దుటూరు జూన్ 21 ప్రభాతవార్త

యోగా ప్రతి ఒక్క మనిషి జీవనశైలిలో భాగమై ఉండాలని యోగాసనాలు వేసి తమ ఆరోగ్యాన్ని నిలకడగా ఉండేలా చూసుకోవాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పిలుపునిచ్చారు శనివారం ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఏర్పాటు చేసిన యోగ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో మూడు ప్రాంతాలలో యోగ ఆసనాలు వేసుకునేందుకు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరద ఉత్సాహంగా యోగాసనాలు వేశారు. అనంతరం మాట్లాడుతూ యోగా శారీరక, మానసిక, మరియు ఆధ్యాత్మిక శ్రేయస్సును పెంపొందించే ఒక ప్రాచీన అభ్యాసం అన్నారు. యోగా ఒత్తిడిని తగ్గించడానికి, ఏకాగ్రతను పెంచడానికి, శ్వాసకోశ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి మరియు మొత్తం శ్రేయస్సును సాధించడానికి సహాయపడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, ఆర్టీఓ సాయిశ్రీ, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, ఎంఈఓ శోభారాణి, రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ బేపారి జాకీర్, మాజీ జడ్పీటీసీ సభ్యులు తోట మహేశ్వర రెడ్డి, తెదేపా పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఆసం రఘురామి రెడ్డి, నాగరాజు, మున్సిపల్ కౌన్సిలర్లు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

### మున్సిపల్ కమీషనర్ ప్రమీళ



యోగా నిర్వహిస్తున్న దృశ్యం

మదనపల్లె, జూన్ 21 ప్రభాతవార్త :

యోగా చేయడం వల్ల ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండవచ్చునని మున్సిపల్ కమీషనర్ ప్రమీళ తెలిపారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా శనివారం పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ నిత్య జీవితంలో యోగాకు ప్రతి ఒక్కరూ కొంత సమయం కేటాయించాలని, ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు యోగా ప్రధాన ఆయుదం అన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మే 21నుంచి నెలరోజులు పాటు యోగాను నిర్వహించడం జరిగిందన్నారు. చివరి రోజు యోగాడే సందర్భంగా యోగా గురించి శిక్షణార్థులచేత వివరించడం జరిగిందన్నారు. ఉదయం 7గంటల నుంచి 8గంటల వరకు గంటపాటు యోగాను నిర్వహించారు. అదే విధంగా పట్టణంలో ప్రతి సచివాలయ పరిధిలోనూ, మున్సిపల్ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలల వద్ద యోగాడేను ఘనంగా నిర్వహించారు.

## యోగతోనే మంచి ఆరోగ్యం

లక్కిరెడ్డిపల్లి; జూన్ 21, ప్రభాతవార్త

యోగాతో మంచి ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీవో ఉషారాణి పేర్కొన్నారు ప్రపంచ యోగా దినోత్సవం పురస్కరించుకొని శనివారం మండలంలోని 11 సచివాలయ పరిధిలో ఆయా గ్రామ వార్డు గ్రామ సచివాలయ అధికారితో ఉపాధి కూలీలు డ్వాక్రా మహిళలు ఆరోగ్య సిబ్బంది అంగన్వాడీలు అన్ని శాఖల అధికారులు యోగ కార్యక్రమంలో పాల్గొని యోగ ఆసనాలను నిర్వహించారు ఈ సందర్భంగా ఎంపీడీవో ఉషారాణి మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలో దేశవ్యాప్తంగా యోగా కార్యక్రమం నిర్వహించడంతో గొప్ప గర్వకారణం అని దీంట్లో పాల్గొనడం మన అదృష్టం అన్నారు యోగ వల్ల మంచి ఆరోగ్యంతో పాటు మానసిక ఒత్తులు తగ్గుతాయని ఆమె తెలియజేశారు ఈ కార్యక్రమంలో తాసిల్దార క్రాంతి కుమార్ ఎంఈఓ చక్కెరె నాయక్ వెంకటసుబ్బయ్య డీటీలు నరసింహులు రెడ్డన్న ఏడి విజయ కుమారి ఏవో తదితరులు పాల్గొన్నారు.



కాకులవరం గ్రామంలో యోగా నిర్వహిస్తున్న ఉపాధి కూలీలు

# వ్యక్తిగత ఆరోపణలు తప్ప ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి ఏది

### కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ఎస్ ఇర్ఫాన్ భాష

ప్రొద్దుటూరు జూన్ 21 ప్రభాతవార్త



నియోజకవర్గంలో అధికార, ప్రతిపక్ష నాయకులు తమ వ్యక్తిగత ఆరోపణలు చేసుకోవడమే తప్ప నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి ఏదని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ఇర్ఫాన్ భాష సూటిగా ప్రశ్నించారు. శనివారం తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజా సమస్యలను అభివృద్ధిని గాలికి వదిలేసి ఒకరిపై ఒకరు వ్యక్తిగత అవినీతి ఆరోపణలు చేసుకోవడం వల్ల ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. ఒకరిపై ఒకరి వ్యక్తిగత అవినీతి ఆరోపణలు చేసుకుంటూనే హైదరాబాదులో రహస్య ఒప్పందాలు చేసుకుంటున్నారని విమర్శించారు. గత ఎన్నికలకు ముందు నుండి మాజీ ఎమ్మెల్యేపై ప్రస్తుత ఎమ్మెల్యే అవినీతి ఆరోపణలు చేస్తున్నారని కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడిచిన ఎందుకు విచారణ జరిపి చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. పట్టణంలో పారిశుద్ధ్య వ్యవస్థ అధ్వాన్నమైన పరిస్థితుల్లో ఉందని తాగునీటి పైపులైను కొత్తగా ఏర్పాటు చేయాల్సి ఉందని మురుగునీటి ప్రధాన కాలువలను ఆధునికరించి మెరుగైన పారిశుధ్యాన్ని అందించాల్సి ఉందన్నారు. ఇప్పటికైనా ఒకరిపై ఒకరు వ్యక్తిగత అవినీతి ఆరోపణలు మానుకొని ప్రొద్దుటూరు ప్రజల సమస్యల పరిష్కారం పై ఆగిపోయిన అభివృద్ధి పనులను పునః ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ సెక్రెటరీ సోషల్ మీడియా కన్వీనర్ చెన్నూరు మహమ్మద్ అబ్బాస్ లు పాల్గొన్నారు.

## మానవత్వాన్ని చాటుకున్న మాజీ ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు జూన్ 21 ప్రభాతవార్త



పట్టణంలో యూట్యూబర్‌గా నివసిస్తున్న సెల్వం సుధాకర్ అనారోగ్యంతో స్థానిక డాక్టర్ నాగ దస్తగిరి రెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి శనివారం ఆసుపత్రిని చేరుకొని సుధాకర్‌ను పరామర్శించి 50 వేలు ఆర్థిక సహాయం అందించి మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. చికిత్స పొందుతున్న సుధాకర్‌కు ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి చికిత్స అయ్యే ఖర్చు తానే భరిస్తానని ఎలాంటి భయానికి గురికావద్దని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు మండల అధ్యక్షుడు సానబోయిన శేఖర్ యాదవ్ కౌన్సిలర్లు పాతకోట వంశీధర్ రెడ్డి భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి గరిశపాటి లక్ష్మీదేవి నూక నాగేంద్రారెడ్డి, సత్యం, అనిల్ జిల్లా ప్రచార విభాగం ఉపాధ్యక్షులు గోటూరు వెంకటేష్ ప్రొద్దుటూరు నియోజకవర్గం ప్రచార విభాగ అధ్యక్షులు దేసు రామ్మోహన్ రెడ్డి మరియు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రతి అంశంపై పరిజ్ఞానం అవసరం... నల్లారి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి

కె.వి పల్లి జూన్ 21 ప్రభాతవార్త :

కంభం వారి పల్లి నేటి పోటీ ప్రపంచంలో ప్రతి అంశంపై ప్రపంచ స్థాయి విషయ పరిజ్ఞానం పెంపొందించు కోవాల్సిన అవసరం ఉందని పీలేరు నల్లారి ఎమ్మెల్యే కుమార్ రెడ్డి అన్నారు. శనివారం కంభం వారి పల్లి మండలం గ్యారంపల్లె గురుకుల పాఠశాలలో ఐసిఐసిఐ బ్యాంక్ ఫౌండేషన్ వారిచే 40 కంప్యూటర్లు మంజూరు చేసి ఏర్పాటు చేసిన కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి విద్యా సాంకేతిక పరంగా నైపుణ్యాభివృద్ధి దిశగా ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ క్రమంలోనే అవసరమైన చోట కంప్యూటర్ శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించి నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడానికి చర్యలు తీసుకుంటుందన్నారు. గురుకుల పాఠశాలలో ఏర్పాటుచేసిన కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని అవసరమైన కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలలో అత్యధిక మార్పులు సాధించి ప్రతిభ చాటిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు కూటమి నాయకులు, కార్యకర్తలు, నల్లారి అభిమానులు పాల్గొన్నారు.

## యోగాంధ్రలో పాల్గొన్న ఉపాధి కూలీలు



పెద్దమండెం జూన్ 21 ప్రభాతవార్త

అంతర్జాతీయ యోగా దినోత్సవం 21న యావత్ భారతదేశం తో పార్టీ సుమారు 175 దేశాలు కూడా ఈ యోగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలు కార్యాలయాల్లో శనివారం ఉదయం 6 గంటల నుంచి యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు ప్రతి గ్రామంలో ప్రతి పల్లెలో నిర్వహించడం అలాగే గిరిజన తండాల్లో ఉదయాన్నే ఉపాధి కూలీలకు వెళ్లిన వారితో కూడా ఉపాధి సిబ్బంది యోగ కార్యక్రమాన్ని నిర్వహించారు దీనివల్ల ఆరోగ్యం బృహత్వం రోగాలు రాకుండా ఆయురారోగ్యాలతో ఉండవచ్చని దీని ద్వారా ఉల్లాసంగా దేహదారుఢ్యం పెంపొందించుకోవచ్చని ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ రోజుకు ఒక్క గంట చేయాలని దీన్ని దినచర్యగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. దీని ద్వారా ఎంతో ఉపయోగం ఉంటుందని తెలిపారు.

## యోగాతో మానసిక ఒత్తిడి నియంత్రణ

ముద్దనూరు, జూన్ 21, ప్రభాతవార్త:

ప్రతిరోజు క్రమ తప్పకుండా యోగా చేస్తే మానసిక ఒత్తిడిని నియంత్రవచ్చుని అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం నాడు యోగాంధ్ర కార్యక్రమాన్ని మండల అధికారులు ఘనంగా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే తప్పకుండా ప్రతిరోజు యోగ చేపట్టాలని సూచించారు. అనంతరం స్వచ్ఛంద కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో మండల ప్రత్యేక అధికారిని శిరీష ఆధ్వర్యంలో చెట్లు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో పరిపూర్ణ అరుంధతి, తహసిల్దార్ వరద కిషోర్ రెడ్డి, ఎక్సైజ్ సీఐ విన్నిలత, ఎంఈఓ నాగేశ్వర్ నాయక్, మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి లక్ష్మీనరసింహులు, సర్పంచ్ బోనం సరళ, సిబ్బంది పాల్గొన్నారు.

